

కిరాయి బంధువులు

'మీకు డబ్బులు ఎంతైనా ఇస్తాం. భోజనం, వసతి కల్పిస్తాం. మా ఇంటికి వచ్చి, 78 ఏళ్ల అమ్మను కనిపెట్టు కుని ఉండాలి. ఆమె ఏ పనులు చేసుకోలేదు. కంటికి రెప్పలా కాపాడుతూ అవసరాలు తీర్చాలి' అంటూ అద్దె మనుషుల కోసం ఇప్పుడు అన్వేషణ కొనసాగుతోంది.

- ఆదివారం ప్రత్యేక కథనం- 6లో..

నేవీ ఆయుధ డిపో ఏర్పాటుపై పునరాలోచన : ఎంపీ పుట్టా

ఏలూరు టూ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లో నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు ఏర్పాటుపై పునరాలోచన చేస్తున్నట్టు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నేవీ ఆయుధ డిపో ప్రాజెక్టు వల్ల వందలాది మంది స్థానిక యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. రెండు వేల కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపడుతున్నామన్నారు. స్థానికులు ప్రాజెక్టు నిర్మాణంపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నందున ఎక్కడ పెట్టాలనేది పునరాలోచన చేస్తున్నామన్నారు. ప్రజలు, ప్రజా సంఘాల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుని ప్రాజెక్టును మార్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు

ఏలూరు టూటౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయంలో వీధి కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో 50 డివిజన్లలో సుమారు 1900 వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రజలను వీధి కుక్కల బారి నుంచి రక్షించేందుకు హర్యానకు చెందిన యానిమల్ వెల్ఫేర్ సొసైటీ సహకారంతో శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామన్నారు. రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నామన్నారు. అడిషనల్ కమిషనర్ చంద్రయ్య, ఏడీ సుబ్రహ్మణ్యం, యానిమల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ హేమంత్, జే.నరసింహారావు, డాక్టర్ వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత.. అగచాట్లు!



ఏలూరు నగరంలో వర్షం...



ముదినేపల్లిలో నేలకొరిగిన వరి పైరు

ఫెంగల్ తుపాను ప్రభావం

- జిల్లాలో కురుస్తున్న వర్షాలు
- ధాన్యాన్ని బరకాలతో కప్పి రక్షించుకుంటున్న రైతులు
- మరో రెండు రోజులపాటు వర్షసూచనలతో దిగాలు
- వరి కోతలు ఆపండి : జేసీ

ఏలూరు సిటీ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఫెంగల్ తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉండదని భావించినప్పటికీ వర్షాలు కురుస్తున్నాయి. మాసూళ్ల సమయంలో కురుస్తున్న వర్షాల వల్ల రహదారులపై ఆర బెట్టిన ధాన్యం, కల్లాల్లోని ధాన్యం తడిచి పోయింది. దీంతో రైతులు ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టు మిట్టాడుతున్నారు. బరకాలపై ఉన్న నీళ్లను బక్కెట్లతో తోడుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 77 వేల 446 హెక్టార్లలో సార్వా వరి సాగు చేయగా ఇప్పటివరకు 27 వేల 247 హెక్టార్లలో మాత్రమే వరి కోతలు పూర్త య్యాయి. 35 శాతం మాత్రమే వరి మాసూళ్లు పూర్తయినట్టు జిల్లా వ్యవసాయ శాఖ నివేదికలు చెబుతున్నాయి. ఉత్తర కోస్తాలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు తమ వరి పంటను రక్షించుకోవటానికి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. కోసిన వరి పంటను ప్రస్తుతం బరకాలు కప్పి రక్షించుకుంటున్నామని, ఇంకా భారీగా వర్షాలు కురిస్తే ధాన్యం మొత్తం తడిసి పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల ఆరబెట్టిన ధాన్యంలో కూడా తేమశాతం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో వర్షపాతం

జిల్లాలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జిల్లాలో అత్యధి కంగా ఉంగుటూరు మండలంలో 4.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



ఏలూరు మండలంలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు



అమ్మపాలెంలో రైతులతో మాట్లాడుతున్న జేడీ హబీబ్ బాషా



ఏలూరు నగరంతో పాటు జిల్లాలోని పలు పట్టణాలు, మండల కేంద్రాల్లో భారీగా వర్షాలు కురిశాయి. జిల్లాలో సరాసరి వర్షపాతం 1.1 మి.మీ నమోదైంది. ఉంగుటూరులో 4.4, ఏలూరు రూరల్ 4, ఏలూరు అర్బన్ 3.2, ముదినేపల్లి 3, నిడమర్రు 3 మి.మీ వర్షపాతం నమోదుకాగా జిల్లాలోని మిగిలిన మండలాల్లో 3 మి.మీ కన్నాతక్కువగానే వర్షాలు కురిశాయి.

భీమడోలులో ధాన్యం రాశులను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

రాబోయే రెండు రోజులు వరి కోతలు కోయవద్దు : జేసీ

దెందులూరు/ భీమడోలు/ ఉంగుటూరు/ పెదవేగి : ఫెంగల్ తుఫాను కారణంగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయని, వర్షాలకు రాబోయే రెండు రోజుల్లో వరి కోతలు కోయవద్దని జేసీ ధాత్రిరెడ్డి రైతులను కోరారు. తుఫాన్ వల్ల ఏ రైతు నష్ట పోకుండా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దెందులూరు మండలం దెందులూరు, కొత్తగూడెం, సీతంపేట, భీమడోలు మండలంలోని పలు గ్రామాల్లో, ఉంగుటూరు మండలంలోని గోపీనాథపట్నంలోని పొలాల్లో ఉన్న ధాన్యం రాశులను జేసీ శనివారం పరిశీలించారు. ధాన్యం తడవకుండా రైతులకు అవసరమైన టార్పాలిన్‌లను అందు బాటులో ఉంచామన్నారు. తేమ శాతం ఒకటి లేక రెండు శాతం ఎక్కువగా ఉన్నా మిల్లులకు వెంటనే పంపించాలని సూచించారు. అధికారులు తమ మండల కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండాల న్నారు. ఏదైనా సమస్య వస్తే టోల్ ఫ్రీ నంబరు 1800 425 6453కి తెలపాల న్నారు. దెందులూరు తహసీల్దార్ సుమతి, రెవెన్యూ అధికారి హేమమాలిని, భీమడోలు ఏవో ఉషారాణి, ఉంగుటూరు ఇన్‌చార్జి తహసీల్దార్ వై.పూర్ణ చంద్ర ప్రసాద్, వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్ ఆమె వెంట ఉన్నారు.

టార్పాలిన్లు సరఫరా చేస్తాం : వ్యవసాయ శాఖ జేడీ

ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్‌లను సరఫరా చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ ఎస్కే హబీబ్‌బాషా తెలిపారు. పెదవేగి మండలం అమ్మపాలెం, దుగ్గిరాలల్లో శనివారం పర్యటించారు. జాతీయ రహదారిపై ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకోవడానికి రైతులు పడుతున్న అవస్థలను స్వయంగా పరిశీలించారు. ధాన్యం కొనుగోలును వేగవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మండల వ్యవసాయాధికారిణి ఎం.ప్రియాంక, వీఏఏలు ధనరాజ్, శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం హడావుడిగా ఇళ్లకు తరలింపు



వేల్పుచర్లలో వృద్ధుడికి పెన్షన్ అందజేస్తున్న మంత్రి పార్థసారథి

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొలుసు.. వేల్పుచర్లలో లబ్ధిదారులకు పెన్షన్ అందజేత

మునునూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజలకు సంక్షేమాన్ని అందించడంతోపాటు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని వేల్పుచర్లలో శనివారం ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్‌ను అందించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ మునునూరు మండలంలో 7,874 మందికి రూ 3కోట్ల30 లక్షల 75 వేల 500, వేల్పుచర్లలో 759 మందికి రూ.32 లక్షల 17 వేలు అందిస్తున్నట్టు తెలిపారు. డిసెంబరు మొదటి తేదీ నుంచి నూతన పెన్షన్ల కోసం అర్హులైన వారు సచివా లయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రానున్న ఐదేళ్లలో చింతలపూడి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేస్తామన్నారు. మండలంలో రోడ్లు, డ్రెయినేజీ, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించడంతో పాటు వెంకటాపురం తమ్మిలేరులో చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. మండలంలో భూ సమస్యలను పరిష్కరిం చేందుకు మండల రెవెన్యూ అధికారులు, జేసీ, ఆర్డీవోలతో ప్రత్యేక సమావేశాన్ని మునునూరులో ఏర్పాటు చేస్తామన్నారు.

94.25 శాతం పింఛన్ల పంపిణీ

ఏలూరు సిటీ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో శనివారం సాయంత్రానికి 94.25 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. డిసెంబరులో 2,62,836 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఏడు గంటల సమయానికి 2,47,722(94.25 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. 605 సచివాలయాల పరిధిలోని 5,298 మంది సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి పింఛన్ అందించారన్నారు. పింఛన్ పొందని లబ్ధిదారులకు సిబ్బంది ఫోన్ చేసి డిసెంబరు రెండో తేదీ సాయంత్రంలోగా నూరుశాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేస్తామని తెలిపారు. కాగా వివిధ కారణాల వల్ల నవంబరు పింఛన్ తీసుకోని వారికి రెండు నెలల పింఛన్ ఒకేసారి పంపిణీ చేయడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విధానం లేదు.

ఖాతా.. కంగారు!

- ఎన్‌పీసీఐకి అనుసంధానం కాని అక్కౌంట్లు 1.61 లక్షలు
- పునరుద్ధరణకు అవకాశమున్నా కొత్త ఖాతాల కోసం పోస్టాఫీసుల్లో రద్దీ
- సచివాలయాల్లో ఎన్‌పీసీఐ లింక్ కాని లబ్ధిదారుల జాబితాలు

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు రాయితీ సొమ్మును నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు అవసరమైన జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ)ని ఖాతాలకు అనుసంధానం చేయడంపై క్షేత్రస్థాయిలో అపోహలు, సందేహాలు విస్తృతం కావడంతో పెద్ద సంఖ్యలో ప్రజలు పోస్టాఫీసులకు ఎగబడుతున్నారు. బ్యాంకు లేదా పోస్టాఫీసు పొదుపు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానమైతేనే ప్రభుత్వ పథకాల రాయితీ సొమ్ము జమ అవుతుందని కొంతకాలం క్రితమే ప్రభుత్వం ప్రకటించినా రానున్న కొద్దిరోజుల వ్యవధిలోనే రాష్ట్రప్రభుత్వం నుంచి రాయితీ నిధులు లబ్ధిదారుల ఖాతాలకు జమ కానున్నట్టు ప్రచారం జరగడంతో ఒక్కసారిగా రద్దీ కొన్నిరెట్లు పెరగడానికి కారణమైంది. జిల్లాలో ప్రస్తుతం ఆర్థిక లావాదేవీలు కొనసాగుతూ లైవ్‌లోవున్న బ్యాంకు, పోస్టాఫీసు మొత్తం పొదుపు ఖాతాల్లో 1.61 లక్షలు ఎన్‌పీసీఐకి అనుసంధానం కాలేదని ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంకు (ఐపీపీబీ) జిల్లా మేనేజర్ రాజేశ్ శనివారం వెల్లడించారు. ఈ ఖాతాలను తిరిగి లావాదేవీలకు పనికి వచ్చేలా లైవ్‌లోకి తీసుకురావాలంటే సంబంధిత బ్యాంకుకు ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తీసుకెళ్లి, కొంత నగదు మొత్తాన్ని జమచేసిన తర్వాత అభ్యర్థన పత్రాన్ని అందజేస్తే నిబంధనల మేరకు ఖాతాను మళ్ళీ లైవ్‌లోకి తీసుకొస్తారు. అలాకాకుంటే కొత్తగా బ్యాంకు పొదుపు ఖాతాను తెరవాలనుకుంటే బ్యాంకు నిబంధనలు, షరతులను బట్టి రూ.500ల నుంచి రూ.2వేలు చెల్లించి, అవసరమైన ధ్రువపత్రాలు, అభ్యర్థన దరఖాస్తును అందజేస్తే కొత్త ఖాతాను తెరుస్తారు. అంతమొత్తాన్ని చెల్లించే స్తోమతలేని వారికి రూ.200 చెల్లింపుతో పోస్టాఫీసులో కేవలం ఆధార్ కార్డు వివరాలు, వేలిముద్ర తీసుకుని పేపర్‌లెస్ పద్ధతిన అక్కడికక్కడే కొత్తఖాతాను తెరిచే వీలుండటంతో కొద్దిరోజులుగా ప్రజలు పోస్టాఫీసులకు బారులు తీరుతున్నారు.



ఏలూరు మెయిన్ పోస్టాఫీస్‌లో ఎన్‌పీసీఐ చేయించుకుంటున్న మహిళలు

సచివాలయాల్లో ఎన్‌పీసీఐ లింక్‌కాని లబ్ధిదారుల జాబితాలు

జిల్లాలోని అన్ని సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, కార్యదర్శులకు వారి పరిధిలో ఎన్‌పీసీఐకి అనుసంధానం కాని లబ్ధిదారుల వివరాలను ఇప్పటికే ప్రభుత్వం పంపించింది. కనీసం పదిమంది ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేయాల్సి ఉంటే అక్కడికే పోస్ట్‌మ్యాన్‌ను పంపించి లింక్ చేయించే వెసులుబాటు కల్పించారు. అయినప్పటికీ తమ బ్యాంకు పొదుపు ఖాతాలు లైవ్‌లో ఉన్నదీ, లేనిదీ పరిశీలించుకోకుండానే ప్రజలు అపోహలతో పోస్టాఫీసులకు వెల్లువెత్తుతున్నారని తపాలా అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో కొందరు ప్రస్తుతం వున్న బ్యాంకు ఖాతాలు ప్రభుత్వ రాయితీ సొమ్మును పొందేందుకు పనికిరావని పోస్టాఫీసులో కొత్తగా ఖాతాను తెరవాల్సిందేనని చేస్తున్న దుష్ప్రచారం కూడా పోస్టాఫీసుల్లో రద్దీ అమాంతం పెరగడానికి కారణంగా తెలుస్తోంది.

పోస్టాఫీసులకు రానక్కర్లేదు..

బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలు పని చేస్తుంటే ఎన్‌పీసీఐకి అనుసంధానం అయి వున్నట్టే. ఈ విషయం తెలియక చాలా మంది గ్రామాల నుంచి పోస్టాఫీసులకు వస్తున్నారు. జిల్లాలో ఎన్‌పీసీఐకి లింక్‌కాని 1.61 లక్షల ఖాతాల్లో పదేళ్ల లోపు వయస్సు వున్న పిల్లలు, ఇతరప్రాంతాలకు వలస వెళ్ళిపోయినవారు, ఇక్కడకువచ్చిన వలస ప్రజలు, చనిపోయిన వ్యక్తులు ఉన్నారు. ఇటువంటివారి ఖాతాలను అనుసంధానం చేయడం సాధ్యం కాదు. ప్రజలు ముందు గా తమ పరిధిలోని సచివాలయా నికి వెళ్ళి అక్కడి జాబితాలో ఉన్నదీ, లేనిదీ పరిశీలిం చుకోవాలి. బ్యాంకు ఖాతా ఉంటే సంబంధి త బ్యాంకుకు వెళ్ళి నిబంధనల మేరకు ఖాతాను పునరుద్ధరించుకుంటే సరిపోతుంది. కొత్తగా పోస్టాఫీసు పొదుపు ఖాతా అవసరమనుకున్న వారు మాత్రమే సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లేదా కార్య దర్శికి తెలిపితే స్థానిక పోస్ట్ మాస్టర్ దృష్టికి తీసుకెళ్లి అక్కడికే పోస్ట్‌మ్యాన్‌ను పంపించి ఖాతాను తెరిపిస్తారు. ఇందుకు రూ.200 మినహా అదనంగా చెల్లించనవసరం లేదు. ఎన్‌పీసీఐకి అనుసంధానం చేసి పాత పోస్టల్ ఖాతాను పునరుద్ధరించడానికి ఎటువంటి రుసుం పోస్ట్‌మ్యాన్‌కు చెల్లించనక్కర్లేదు. ఇప్పటికిప్పుడు ప్రభుత్వ పథకాల రాయితీ సొమ్మును లబ్ధిదారుల ఖాతాలకు జమ చేస్తున్నారన్నది అవాస్తవం. గత ఐదు రోజుల్లో జిల్లావ్యాప్తంగా మూడు వేల ఖాతాలను ఎన్‌పీసీఐకి అనుసంధానం చేశాం.

- రాజేశ్, మేనేజర్, ఐపీపీబీ, ఏలూరు



ఆసుపత్రుల్లో ఏదీ శుభ్రత

ఈ చిత్రం తణుకు ప్రభుత్వాసుపత్రి ఆవరణలోది. ఇక్కడ వైద్య సేవలు మెరుగ్గా ఉన్నప్పటికీ.. పారిశుధ్యం తీసికట్టుగా వుంది. ఇలాంటి పరిస్థితే మిగిలిన ఏరియా ఆసుపత్రుల్లోనూ కనిపిస్తోంది. -7లో

గ్రామాల్లోను స్మార్ట్‌మీటర్లు

- తాగునీటి పథకాలకు, వీధి దీపాలకు సైతం బిగింపు
- ఇకపై విద్యుత్ చౌర్యానికి చెక్

ఏలూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సేవలకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఈపీడీసీఎల్ అధికారులు కొత్తగా స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ చౌర్యానికి చెక్ పెట్టడంతోపాటు మీటర్ రీడింగ్ ఆన్‌లైన్ చేయడానికి ఇది దోహద పడుతుంది. పట్టణ ప్రాంతాల్లో వాణిజ్య కేటగిరీలకు ప్రభుత్వం కార్యాలయాలు, సంస్థలకు ఇప్పటికే స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ ప్రారంభం కాగా, ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లోను స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన స్మార్ట్‌మీటర్లతో విద్యుత్ చౌర్యానికి పూర్తిగా చెక్ పెట్టవచ్చని ఈపీడీసీఎల్ అధికారులు పేర్కొంటున్నారు. వినియోగానికి సంబంధించి సిబ్బంది ప్రతినెల వచ్చి రీడింగ్ తీయాల్సిన అవసరం ఉండదు. ఆన్‌లైన్ ద్వారా మోనటరింగ్ కేంద్రానికి మీటర్ రీడింగ్ చేరుతుంది. ఎన్ని యూనిట్లు వాడారు? ఎంత బిల్లు చెల్లించాలి? అన్న వివరాలు సంబంధిత వినియోగదారుడి మొబైల్ ఫోన్‌కు మెసేజ్ ద్వారా తెలుపుతారు. గడువులోగా బిల్లు చెల్లించక పోతే మోనటరింగ్ కేంద్రం నుంచే స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ సరఫరాను నిలిపి వేసే అవకాశం ఉంటుంది. లైన్‌మెన్ ఇళ్లకు వచ్చి ఫీజులు తీసుకువెళ్ళాల్సిన పని ఉండదు. ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే స్మార్ట్ మీటర్ మోనటరింగ్ కేంద్రానికి సమాచారం పంపుతుంది. విద్యుత్ సరఫరా నిలిచి పోతే ఎక్కడ? ఎందుకు? నిలిచిపోయిందో?స్మార్ట్ మీటర్ వినియోగదారుడికి వెంటనే సంకేతాలు వస్తాయి. సిబ్బంది అక్కడికి వెళ్ళి సమస్యను పరిష్కరిస్తారు. ప్రస్తుతం ప్రతి నెల విద్యుత్ సిబ్బంది మీటర్ రీడింగ్ తీసిన తర్వాత పక్షం రోజుల్లో బిల్లు చెల్లించే వెసులుబాటు ఉంది. స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత వినియోగదారులు ముందుగానే కార్డు ద్వారా డబ్బులు చెల్లించాలి. వినియోగించిన విద్యుత్‌కు సరిపడా డబ్బులు అయిపోతే వెంటనే రీచార్జ్ చేసుకోవాలి. ప్రస్తుతం పంచాయతీల్లో తాగునీటి పథకాలకు, వీధి దీపాలకు సైతం స్మార్ట్‌మీటర్లను బిగించనున్నారు.



ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో బిగించిన మీటర్

వాడివేడిగా..

కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాలపై నూజివీడు మునిసిపల్ కౌన్సిల్‌లో చర్చ

నూజివీడు టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాలను వివిధ శాఖల కార్యాలయాలుగా ఉపయోగించే అంశంపై అధికార వైసీపీ, ప్రతి పక్ష టీడీపీ కౌన్సిలర్ల మధ్య వాద ప్రతివాదనలు జరిగాయి. నూజివీడు మునిసిపల్ సమావేశపు మందిరంలో చైర్ పర్సన్ రామిశెట్టి త్రివేణి దుర్గ అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. నూజివీడు ఎంప్లాయిస్ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో కేంద్రీయ విద్యాలయం తాత్కాలిక భవనాల పేరుతో ఎంపీపీ పాఠశాలను రూ.80 లక్షల వ్యయంతో అభివృద్ధి పరిచారని అయితే నేటికీ కేంద్రీయ విద్యాలయ అంశం ఎటూ తేలకపోవడంతో సంబంధిత భవనాలను వివిధ శాఖల కార్యాలయాల ఏర్పాటుకు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై అధికార వైసీపీ కౌన్సిలర్లు అభ్యంతరం చెబుతూ ఆ భవనాల్లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని పట్టుబట్టగా రెండేళ్లుగా కేంద్రీయ విద్యాలయం అదిగో ఇదిగో అంటూ గత ప్రభుత్వం చెబుతూ వచ్చిందే కాని ఏర్పాటు చేయలేదని భవనాలను నిరుపయోగంగా వదిలేసే కన్నా ఇరిగేషన్, హౌసింగ్ శాఖలకు అద్దె ప్రాతిపదికన ఇవ్వవచ్చంటూ ఫ్లోర్ లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. దీనిపై మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, దుర్గా ప్రసాద్ మధ్య వాద ప్రతివాదనలు జరిగాయి. మున్సిపల్ కౌన్సిల్‌కు వైస్ చైర్మన్ హోదాలో ప్రతిపాదనకు పంపినా అధికారులకు పరిగణలోకి తీసుకోవడం లేదని వైస్ చైర్మన్ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో చేపట్టిన పనులకు సంబంధించి 15.వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించడంపై కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. మునిసిపల్ డీఈ వెంకట్రావ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.





కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం (ఇన్‌సెట్‌లో) చైర్ పర్సన్ త్రివేణి దుర్గ

నేటితో ముగియనున్న కార్తీకం

సోమవారం పోలిస్వర్గం..పాడ్యమి దీపాలు

పవిత్రమైన కార్తీక మాసం ఆదివారంతో ముగియనుంది. ఆదివారం ఉదయం అమావాస్య ఉండటంతో కార్తీకమాసం పూర్తి అవుతుంది. అవకాశం ఉన్నవారు కార్తీక మాసం నెలరోజులు చేసినట్టుగానే సోమవారం తెల్లవారుజామున నదీ లేదా కాల్వ స్నానం చేయాలి. అరటిదొప్పలో దీపాలు వెలిగించి నీటిలో ఆ దీపాలు వదలాలి.. ఇలా చేస్తే కార్తీకమాసం అంతా తెల్లవారుజామున నదీస్నానమాచరించిన ఫలితం దుక్కుతుందని పండితులు చెబుతున్నారు. తర్వాత శివాలయం, వైష్ణవాలయాలను దర్శించాలి.. ఇంటి పురోహితునికి లేదా బ్రాహ్మణుడికి ఉసిరికాయపై ఆవు వత్తి దీపంతో దానం చేయాలి.. స్వయపాకం దానం ఇవ్వాలి.. స్త్రీలు పోలిస్వర్గం నోము పూర్తిచేసుకుని సోమవారంతో కార్తీక మాస దీక్షను విరమించుకుంటారు.







దేదీప్యం.. కార్తీక దీపోత్సవం

భీమవరం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం శనివారం జువ్వలపాలెం రోడ్డులోని పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ఆలయ అర్చకుడు వాడపల్లి ఆదినారాయణాచార్యులు స్వామి వారికి, అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణరాజు వంశపారపర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్ రాజు దీపాలను వెలిగించారు. దీపాల కాంతుల్లో ఆలయం కొత్త శోభను సంతరించుకుంది. వేంకటేశ్వరస్వామి, శంకు, చక్రం పలు ఆకారాల్లో దీపాలను వెలిగించారు.





నిరంతర సాధనే విజయానికి సూచిక

అంతర్జాతీయ క్రీడలే లక్ష్యం కావాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

ముగిసిన గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి పోటీలు

పెదవేగి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనడమే ధ్యేయంగా సాధన ఉండాలని, అప్పుడే ఆశించిన లక్ష్యాన్ని చేరుకోవడానికి మార్గం సుగమం అవుతుందని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. పెదవేగి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మూడురోజులపాటు నిర్వహించిన ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు శనివారం ముగిశాయి. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి విద్యతోపాటు క్రీడలకు సమప్రాధాన్యం ఇవ్వాలని, పాఠశాల స్థాయి నుంచే సాధన చేస్తేనే అంతర్జాతీయ క్రీడాకారులుగా ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. క్రీడలతో వ్యక్తిత్వ వికాసంతో పాటు పట్టుదల, క్రమశిక్షణ, పోటీతత్వం అలవడుతాయని చెప్పారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఏపీ సాంఘుక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ అకడమిక్ మోనటరింగ్ అధికారులు ఎన్.సంజీవరావు, ఎ.మురళీకృష్ణ, బీవీ.మల్లేశ్వరరావు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల సమన్వయాధికారులు ఎన్.భారతి, కె.ప్రేమావతి, పెదవేగి గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వరరావు, స్పోర్ట్స్ అధికారి కె.జయరాజు, నాలుగు జోన్లకు చెందిన పీడీలు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య, బ్యాండ్ ప్రదర్శనలు





బహుమతులు అందిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

విజేతలకు నగదు బహుమతి

విజేతలకు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి బహుమతులు అందించారు. బాలుర జూనియర్స్ స్పోర్ట్స్ విభాగంలో వ్యక్తిగత ఛాంపియన్‌గా జి.నరేంద్రకుమార్ (కురుబేడు, జోన్-3), సీనియర్స్ విభాగంలో జి.జశ్వంత్ (రామకుప్పం, జోన్-4) రూ.10 వేలు నగదు బహుమతి అందుకున్నారు. బాలికల జూనియర్స్ విభాగంలో కె.అశ్విని (వెల్లల, జోన్-4), సీనియర్స్‌లో వి.పరిమళ (సూళ్ళూరుపేట, జోన్ -3) వ్యక్తిగత ఛాంపియన్లుగా రూ.10 వేలు నగదు బహుమతులను కలెక్టర్ చేతులమీదుగా అందుకున్నారు. స్పోర్ట్స్ గేమ్స్ ఆల్ రౌండ్ విభాగంలో బాలికల జూనియర్స్ ఛాంపియన్ షిప్‌ను జోన్ -4 మొదటిస్థానం సాధించగా, జోన్- 3 ద్వితీయస్థానంలో నిలిచింది. సీనియర్స్ జోన్ -1 ప్రథమ, జోన్- 4 ద్వితీయస్థానాలు సాధించారు. బాలుర జూనియర్స్‌లో జోన్-4 ప్రథమ, జోన్ -3 ద్వితీయస్థానాలు సాధించారు. సీనియర్స్ విభాగంలో జోన్ -4 ప్రథమస్థానం సాధించగా, జోన్ -1 ద్వితీయస్థానంలో నిలిచారు.

బండి ముత్యాలమ్మను దర్శించుకున్న హైకోర్టు జడ్జి

మొగల్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముత్యాపల్లిలో బండి ముత్యాలమ్మని హైకోర్టు జడ్జి కె.సురేష్‌రెడ్డి, విశ్రాంత జడ్జి ఏ.వి శేషసాయిలు శనివారం సాయంత్రం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈవో మోకా అరుణ్ కుమార్, ఆలయ సిబ్బంది పాలకవర్గ చైర్మన్ కడలి మాణిక్యాలరావులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వారి వెంట నరసాపురం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనం అనంతరం పేరుపాలెం సాగర తీరానికి వెళ్ళి అక్కడ రిసార్ట్స్‌లో బస చేస్తారు.



హైకోర్టు జడ్జి కె.సురేష్ రెడ్డి, విశ్రాంత జడ్జి శేషసాయిలను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఎంఏ ఎకనామిక్స్‌లో సరస్వతికి గోల్డ్‌మెడల్

ద్వారకాతిరుమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పేరుకు తగ్గట్టు చదువులో ఆమె సరస్వతి.. పీజీలో గోల్డ్ మెడల్ సాధించింది. తమిళనాడు రాష్ట్రం తిరువాయూర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీలో ఎంఏ ఎకనామిక్స్ ఫస్ట్ ర్యాంక్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. శనివారం యూనివర్సిటీ ఛాన్స్‌లర్ గోవిందరాజన్ పద్మనాభన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ తీసుకుంది. ఈమె పేరు తైదల సరస్వతి ప్రవల్లిక. మండలంలోని కొమ్మర గ్రామంలో నివాసం. చిన్నప్పటి నుంచి చదువుపై ఆసక్తి. 5 వరకూ ద్వారకాతిరుమల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో , 10వరకూ బుట్టాయిగూడెం గురుకులంలో చదివింది. పీజీ సెంట్రల్ యూనివర్సిటీలో చదివి గోల్డ్ మెడల్ సాధించింది. తండ్రి మండలంలోని పంగిడిగూడెంకు చెందిన తైదల శ్రీనివాసరావు నాలుగేళ్ల క్రితం మృతి చెందగా తల్లి ఇందిర కుమారి కుమార్తెను కష్టపడి చదివించారు.



యూనివర్సిటీ చాన్సలర్ నుంచి గోల్డ్ మెడల్

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అక్షర

మండవల్లి నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మండవల్లి గ్రామానికి చెందిన పసుపులేటి అక్షర తన ప్రతి భతో చోటు దక్కించుకుంది. మండవల్లికి చెందిన పసుపులేటి శివకృష్ణ, లక్ష్మీప్రసన్న దంపతులు ఇద్దరూ ప్రభుత్వ ఉద్యోగులు. వారి ఏకైక పుత్రిక అయిన పసుపులేటి అక్షర చిన్నప్పటి నుంచి అసమాన ప్రతిభ కనబరిచేది. ఇంటి వద్దనే కొత్త విషయాలు నేర్చుకోవడానికి ఆసక్తి చూపేది. దీంతో చిన్నారి ఆసక్తిని గమనించిన పాప పిన్ని శ్యామల పాఠ్య విషయాలతో పాటు ఆధ్యాత్మిక అంశాల్లోనూ శిక్షణ ఇచ్చేది. భగవద్గీతలోని శ్లోకాలు చెప్పడం, మంత్రపుష్పం , యూకేజీలో ఉన్నప్పుడే భారతదేశంలోని రాష్ట్ర ,కేంద్రపాలిత ప్రాంతాలు వాటి రాజధానులను కేవలం 40 సెకన్లలోనే చెప్పడం, అబాకస్‌లో సైతం మంచి ప్రతిభను కనబరిచడం వంటి వాటిని గమనించిన పాఠశాల యాజమాన్యం పాపను పై తరగతికి ముందుగానే ప్రమోట్ చేయడంతో పాప ప్రస్తుతం మూడో తరగతి చదువుతోంది.



రసాయనశాస్త్రంలోని ఆధునిక పీరియాడిక్ టేబుల్‌లోని 118 మూలకాలను నిమిషంలోపు పఠించేలా శిక్షణ ఇచ్చారు. పాప వాటిని కేవలం 55 సెకన్లలోనే చెబుతుంది. ఈ విషయాన్ని "ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్" వారి దృష్టికి తీసుకువెళ్లగా వారు పరిశీలించి ఒక రికార్డుగా గుర్తించి ఐబీఆర్ అచీవర్ (ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవర్) అవార్డు, మెడల్, సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్



కిరాయి బంధువులు

- మంచాన పట్టిన పెద్దలకు వీరే దిక్కు
- మారుతున్న కాలంలో సరికొత్త పోకడ
- నెలవారీ సొమ్ము చెల్లిస్తే సపర్యలు..
- ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నంతో వృద్ధులు విలవిల
- ఆఖరి క్షణాల్లో అయినవారు దూరం
- బంధువులు, స్నేహితుల పాత్ర అంతంత మాత్రమే
- చివరిలో అద్దె మనుషులే ఆధారం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఒకప్పుడు ఎవరైనా ఇంట్లో మంచానపడితే ఏమైనా రోగాల బారిన పడితే వారి ఆలనా పాలనా చూసేందుకు కుటుంబంలో ఎవరో ఒకరు బాధ్యత భుజానకెత్తుకునే వారు. బంధు వులు, స్నేహితులు వచ్చీపోయే వారంతా ధైర్యం నూరి పోసేవారు. అస్వస్థత నుంచి పూర్తిగా బయట పడేంత వరకు ఇదంతా మా కర్తవ్యం అనేలా సేవలందించేవారు. కానీ రోజులు మారాయి. మనస్తత్వాలు మారాయి. రోజువారీ పని ఒత్తిడి ఇంకాస్త పెరిగింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఎవరైనా మంచం పడితే చూసేవారే కరువయ్యారు. పల్లె, పట్నం తేడా లేకుండా అన్నింటా ఏదో తెలియని ఆవేదన..అద్దె మనుషులే ఇప్పుడు అన్నింటికీ ఆధారం.

ఎందుకిలా జరుగుతుంది

కుటుంబ వ్యవస్థలో ఏ రోజుకారోజు మార్పులు, చేర్పులు. ఒకప్పటి ప్రశాంత వాతావరణం చెదిరిపోయింది. ఉరుకులు, పరుగుల జీవనం. తెల్లవార్లూ నిద్రలేకుండా ఒత్తిడికి గురయ్యేవారు కొందరైతే కాలక్షేపంగా నెట్‌లో మునిగిపోయేవారు ఇంకొందరు. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో ఎవరైనా మంచాన పడితే ఇక అప్పటి నుంచి కష్టాలు ఆరంభమే. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇళ్ళల్లోనే నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాలి. కాలు, చెయ్యి కదపలేని పరిస్థితిలో వారికి సేవలు అందించేందుకు ఎవరో ఒకరు నిత్యం తోడుకావాల్సిందే. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లో అత్యధికులు వృద్ధులే ఉంటారు. వయసుపైబడి తీవ్ర అనారోగ్యంతో దేవుడి పిలుపు కోసం ఎదురుచూస్తూ మంచాన పట్టిన వారికి కనీసం సేవలు అందించడం ఇప్పుడు ఆయా కుటుంబాల్లో ఒక పెద్ద టాస్క్. ఇంట్లో ఉన్న మహిళలతో పాటు మిగిలిన వారికి రోజూ ఏదొక పని ఉండే ఉంటుంది. రోగి వద్దే అంటిపెట్టుకుని కూర్చోవడం, వారికి సపర్యలు చేయడం అత్యంత దుర్లభం. ఇలాంటి పరిస్థితులు ఒకనాడు ఏ కుటుంబంలో తలెత్తినా రక్తబంధువుల్లో ఎవరో ఒకరు కలుగచేసుకుని వచ్చి వాలిపోయేవారు. రోజుల తరబడి వారికి దగ్గరుండి మరీ సేవలు అందించేవారు. ఎటువంటి బేషజాలకు పోయేవారుకాదు. కాని ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితులు కనుమరుగయ్యాయి. వాటి స్థానంలో మంచాన పట్టిన మనిషికి ఇంట్లో ఏ హోదా ఉన్నా సరే పూర్తి సేవలు అందించేందుకు ఏ ఒక్కరూ రోజుకింత సమయం కేటాయించలేని విపత్కర పరిస్థితి. త్వరలోనే కోలుకుంటారు..ఏం పర్వా లేదని కనీసం ధైర్యవచనాలు పలికే వారు కూడా కరువయ్యారు. పిల్లలు ఒకచోట, పెద్దలు ఇంకొక చోట ఒంటరిగా ఉంటున్న కుటుంబాల్లోని వారికైతే అత్యంత దుర్భర పరిస్థితి. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా మూడో వ్యక్తికి చెప్పుకోలేనంత కష్టం. కనీసం ఓదార్పు మాటలకు అల్లంత దూరం. మంచం పట్టినా, ఆసుపత్రులపాలైనా తోడుగా ఉండేవారి కోసం వెతుకులాట. నాలుగైదు రోజులొచ్చి సాయ పడంటంటూ బంధువుల దగ్గర నుంచి స్నేహి తుల వరకు వేడుకోలు. అయినా అందరూ బిజీ బిజీ. మాట వరుసకే తప్ప ఏ ఒక్కరూ నేరుగా వచ్చి చేయి అందించలేనివారే. ఆఖరుకి తోబు ట్టువులైనా, రక్త సంబంధీకులైనా, అత్యంత దగ్గర వారైనా అందరిదీ ఒకటే మాట..బిజీ..బిజీ.

"తినడానికి ఉండడానికి లోటు లేదు. ఇప్పుడు వయస్సు పైబడి మంచాన పట్టాం. మా పని మేం చేసుకోలేకపోతున్నాం. పిల్లలు ఎక్కడో దూరంగా ఉంటున్నారు. రోజువారి కనీసం మాత్రలు వేసుకోవడానికి సాయపడేవారు లేకుండా పోయారు. పిల్లలకు ఈ విషయం చెబితే మేం రాలేంగాని ఓ మనిషిని మీకోసం పెడతున్నామంటున్నారు. అలాగే ఎవరో మొక్కుమొఖం తెలియని మనిషిని మా వద్దే ఉంచుతున్నారు. రోజంతా వారే దిక్కు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ఒకనాడు మనస్సువిప్పి మాట్లాడుకునేవాళ్ళం. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. మనసులో బాధ ఎవరికి చెప్పుకోవాలి...ఏలూరుకు చెందిన సత్యనారాయణ అనే వయోవృద్ధుడి ఆవేదన ఇది.



ఉన్నా లేకపోయినా మంచం పట్టిన వారిని ఆలనా పాలనా చూసుకునేందుకు ఏలూరు నగరంతో పాటు అనేక ప్రాంతాల్లో ఇప్పుడు కొంతమంది 'సేవ'లకు వీలు కల్పిస్తున్నారు. అసలు కదలలేని స్థితిలో ఉన్నవారికైతే వారి వ్యవహారాలన్నింటిని చక్క బెట్టేందుకు నెలకు 25 వేల నుంచి 35 వేల రూపాయలు చెల్లించగలిగితే ఆడ లేదా మగ మనిషిని అందుబాటులో తెచ్చేందుకు ఇప్పుడిప్పుడే కొందరు ముందుకొస్తున్నారు. ఏలూరులో సైతం ఇలాంటి పరిస్థితులే ఉన్నాయి. "వృద్ధాప్యమంటూ వస్తే మూడో కంటికి తెలియకుండా కన్నుమూయాలి. అంతేతప్ప మంచానపట్టి బతుకీడ్చుకురావడం మాత్రం అత్యంత దారుణం. పగవాడికి ఈ పరిస్థితి రాకూడదు" అన్నపూర్ణ అనే వృద్ధురాలి ఆక్రోశమిది.

అద్దెకు.. మనుషులు

మారుతున్న కాలంతో పాటే కుటుంబ వ్యవహారాలు మార్చుకోవాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు తలొక చెయ్యి వేసి కష్టాల కడలిలో ఉన్న వారిని ఒడ్డుకు లాగేవారు. మంచాన పడితే స్వస్థత చేకూరేంత వరకు వదిలిపెట్టేవారే కాదు. ఆఖరుకి ఎంత కష్టమైనా సరే నెలల తరబడి తమకు అయిన వారి దగ్గరే సేవలు అందిస్తూ ఇంటి ముఖం చూడని బంధువులు ఎంత మందో ఉన్నారు. కాని రానురాను పరిస్థితులు తలకిందులవుతున్నాయి. ఇలాంటి ఆలోచనల స్థానంలోనే అద్దె మనుషులు పుట్టుకొచ్చారు. ఎక్కడైనా తల్లిదండ్రులు వృద్ధాప్యంతో మంచానపడితే వారి ఆలనపాలనా చూసే సమయం లేక బిడ్డలంతా బిజీబిజీగా మారారు. తమవారి కోసం అద్దె మనుషులను కొని తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులకు సేవలు అందించేందుకు వీలుగా నెలకు రూ.30 నుంచి 40 వేలు చెల్లించి మరీ ఆడ, మగ మనుషులను నియమిస్తున్నారు. ఇలాంటివారు మంచం పట్టి లేవలేని వారికి సపర్యలు చేస్తూ 24 గంటలు వారితోనే ఉంటారు. అన్నీ ఉండి తమ బిడ్డలు దూరమై కేవలం మీలాంటి వారితో సేవ చేయించుకోవాల్సి వస్తుందంటూ మంచం పట్టినవారు కంట తడిపెడితే ఆ కన్నీటిని తుడిచే వ్యక్తులు ఈ అద్దె మనుషులే. చావొచ్చినా, పెళ్ళొచ్చినా కూడా ఇలాంటి వారే ఈనాటి సమాజంలో అందరికీ అవసరం అవుతున్నారు.

పరాయివాళ్ళే దిక్కు : రామారావు



జీవితాంతం పిల్లల కోసం కష్టపడిన తల్లిదండ్రులు ముసలితనంలో బిడ్డలకు భారమవుతున్నాం. సంపాదించిన ఆస్తినంతా లాక్కుని కన్నవాళ్ళను గెంటేసేవారు కొందరైతే సాకలేమంటూ పీడ వదిలించుకోవాలని భావించేవారు ఇంకొందరు. తల్లిదండ్రులు కదలలేని స్థితిలో ఉన్నా వారిని ఇంటి నుంచి తరిమేసేందుకు వెనుకాడనివారు అనేకమంది. కలికాలంకదా. జరగరానివన్నీ ఇప్పుడే జరుగుతు న్నాయి. అయినవాళ్ళు ఎవరికీ పట్టడం లేదు. బిడ్డలకైనా, బంధువులకైనా, స్నేహితులకైనా ఎవరికైనా కష్టం వచ్చినా నష్టం వచ్చినా ఊరడించేవారు లేరు.

ఇదివరకటి పరిస్థితేది : వెంకటలక్ష్మమ్మ



ఇప్పుడు ఆప్యాయత, ప్రేమ, అనురాగం లాంటి వాటికి అర్థం లేకుండా పోయింది. పక్కింట్లో ఏమైనా ఆపద సంభవిస్తే మాట వరుసకైనా పలకరింపులే తప్ప సహాయ సహకారం లేనేలేదు. ఇది కాలానుగుణంగా వస్తున్న మార్పు. రానురాను కుటుంబ వ్యవస్థలో మార్పులు, చేర్పులు అనివార్యం. ఎవరికైనా ఏమైనా కావాల్సి వచ్చినా రోజుల తరబడి మంచం పట్టినా కనీసం వారిని ఆదుకునేందుకు సొంత మనుషులే కరువవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోనే అద్దె మనుషులు పుట్టుకొస్తున్నారు. చేతిలో డబ్బుంటే అంతా సవ్యంగానే జరుగుతుంది. మరి లేకుంటే..?

రంగులు మారే మందారం



ఉదయం పాలరంగులో.. మధ్యాహ్నం లేత గులాబీ, సాయంత్రం గులాబీ రంగులో మందారం

విరివిగా పూసే పూల మొక్కలలో ప్రత్తి మందారం ఒకటి. సెప్టెంబరు, అక్టోబరులో పూలు పూసే ఈ మొక్కలకు ఒక ప్రత్యేకత ఉన్నది. దీని పూలు రంగులు మారుతుంటుంది.. తెల్లవారుజామున తెల్లటి పాల రంగులో, మధ్యాహ్నం లేత గులాబీ రంగులో, సాయంత్రం 4 గంటలకు ఆపై ఆరు గంటలకు ముదురు గులాబీ రంగులోకి మారుతూ ఉంటుంది. తెలుపు, లేత గులాబీ, ముదురు రంగుల్లోకి మారుతూ ఈ మందారం కనువిందు చేస్తుంది. భీమడోలులోని సాయి సిద్ధార్థ, మోహనరుద్ర ఇంట్లో గతేడాది కడియం నర్సరీ నుంచి తెచ్చిన ఈ మొక్క రంగులు మారుస్తూ చూపరులను ఆకట్టుకుంటున్నది. **- భీమడోలు**

కోతి స్వైరవిహారం



మొగల్తూరు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మొగల్తూరు కోట, గోడావారిపేట గోడావారిపేట, కోట, పెద్ద గొల్లగూడెం ప్రాంతాల్లో కొండముచ్చు స్వైరవిహారం చేస్తూ మేకలను చంపేస్తోంది. శుక్రవారం రాత్రి మేకలు, గొర్రెలు, కోళ్ళను చంపిందని మేకల పెంపకం దారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే శనివారం నాగదేవత ఆలయం వద్ద పండుకోతి రోడ్డుపై కనబడిన కుక్కపిల్లను ఎత్తుకు వెళ్లింది. పిల్లిపిల్లలు, కుక్కపిల్లలను ఎత్తుకెళుతోందని స్థానికులు చెబుతున్నారు.

షష్టి ఉత్సవాలకు ఏర్పాట్లు

అత్తిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : షష్టి ఉత్సవాలకు అత్తిలి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేపట్టారు. ఈనెల 6వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయి. ఆలయ ప్రాంగణంలో భారీ చలువ పందిళ్ళను నిర్మించారు. ఆలయ ముఖద్వారం నుంచి ఆలయం వరకు గల ప్రధాన మార్గాలలో విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. 6వ తేదీ రాత్రి 8.28 గంట లకు కూనపరెడ్డి తేజ, విజయలక్ష్మి దంప తులచే సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు. 7న షష్టి తీర్థ మహోత్సవం, అన్న సమారాధన, రాత్రి స్వామివారి ఊరేగింపు జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

పౌరాణిక నాటకానికి చక్రవర్తి

నేడు షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి

తెలుగు నాటక రంగానికి 150 సంవత్సరాల ఘనమైన చరిత్ర ఉంది. 1880లో ప్రదర్శించబడిన వ్యవహారిక ధర్మబోధిని నుంచి నేటి వరకు కొన్నివేల తెలుగు నాటకాలు వెలుగు చూశాయి. వేలాది మంది నటీనటులు ఎన్నో పాత్రలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. వారందరూ మహనీయులు. తెలుగు నాటకాన్ని ప్రభావితం చేసిన కొద్దిమంది పేర్లు చెప్పాల్సి వస్తే తొలివరుసలో నిలిచే పేరు షణ్ముఖి ఆంజనేయ రాజు. శ్రీకృష్ణుడిగా ఆంజనేయరాజు ప్రేక్షకులకు చిరస్మరణీయులు. పాండవోద్యోగ విజయాలు నాటకంలోని రాయబార పద్యాలు వింటే ఆయన నోటే వినాలి.డిసెంబరు 1వ తేదీ పౌరాణిక నాటకానికి పండుగరోజు లాంటిది. పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసి ఎన్నో సంగీత రాగాలను పౌరాణిక నాటకానికి పరిచయం చేసిన గాన గంధర్వ షణ్ముఖి ఆంజనేయరాజు జయంతి నేడు.. వారి కుమారుడు జయవిజయ కుమార్ రాజు షణ్ముఖి 96వ జయంతిని తణుకు సురాజ్య భవనం నందు 1వ తేదీ ఆదివారం సాయంత్రం ప్రముఖ కవి రసరాజు అధ్యక్షతన నిర్వహించనున్నారు. అదేరోజు షణ్ముఖి పురస్కార ప్రదానం చేయనున్నారు.

కృష్ణుడు, శ్రీరాముని పాత్రల్లో ..

1928 డిసెంబరు 1న అనపర్తి గ్రామంలో ఆంజనేయరాజు జన్మించారు. వారి తండ్రి రంగరాజు తల్లి లక్ష్మీనారాయణమ్మ రంగరాజు అందమైన వాడు. మంచి కంఠం..ఆ రోజుల్లో రాజమండ్రిలోని నాటక సమాజంతో వారికి పరిచయాలు ఉండేవి. స్త్రీ పాత్ర పోషణలో ప్రసిద్ధి చెందిన ముప్పిడి జగ్గరాజు ప్రోత్సాహంతో రంగరాజు బొబ్బిలి యుద్ధం నాటకంలో విజయ రామరాజుగా నటించారట. లక్ష్మీ నారాయణమ్మది తెనాలి దగ్గరున్న మోదుకూరు గ్రామం. కాలక్రమంలో వారి కుటుంబం మోదుకూరు మకాం మార్చారు. అక్కడ ఆంజనేయరాజు సంగీతం నేర్చుకున్నారు. మోదుకూరులో వేమన జయంతి ఉత్సవం జరిగింది. ఆ ఉత్సవంలో శ్రీకృష్ణ రాయబారం నాటకం ప్రదర్శించారు. అందులో సహోదరుడి వేషంలో తొలిసారిగా ఆయన రంగస్థల ప్రవేశం జరిగింది. అయితే అంతకుముందే ఆయన బాల నటులతో కలిసి లోహితునిగా, రఘురాముడిగా నటించారు. తర్వాత ఎందరో గురువులు షణ్ముఖిని తీర్చిదిద్దారు. తెనాలిలో వారికి మంచి గుర్తింపు లభించింది. హరిశ్చంద్ర నాటకంలో నక్షత్ర పాత్రలో ఎంతో పేరుప్రతిష్టలు లభించాయి. ఒకసారి రంగస్థలంపై నటిస్తుండగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం చూశారు.ఆయన గాత్రం, రూపం నచ్చి వెంటనే రాజును పిలిపించి మహాత్మగాంధీ జీవితాన్ని బుర్రకథగా చెప్పమని అడిగారు. సంతోషంగా అంగీకరించిన ఆంజనేయరాజు గాంధీజీ జీవితాన్ని ఆదర్శాలను బుర్రకథగా చెబుతూ ఎన్నో గ్రామాలలో ప్రదర్శనలు చేశారు. కాలక్రమంలో షణ్ముఖి ప్రయాణం తణుకు వైపు సాగింది. తణుకు దగ్గర ఉన్న వరిఘేడులో ఉంటూ నాటక ప్రదర్శనలు చేసేవారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముని పాత్రల్లో ఆయనకు మంచి గుర్తింపు లభించింది. ఎన్నో యేళ్ళుగా ఇతర సమాజాలతో కలసి నటిస్తూ వచ్చిన ఆయన 1948లో శ్రీబాల త్రిపుర సుందరీ నాట్యమండలిని స్థాపించారు. నాట్య మండలి ప్రదర్శించిన నాటకాలలో కురుక్షేత్రం, గయోపాఖ్యానం, శ్రీరామాంజేయ యుద్ధం, శ్రీకృష్ణ తులాభారం నాటకాలు ప్రసిద్ధి చెందాయి. ఎందరో నటీనటీల్ని ఆయన తీర్చిదిద్దారు.

ఆయన రాగాలకు ఎందరో అభిమానులు

కురుక్షేత్రంలో కృష్ణుడిగా గయోపాఖ్యానంలో కృష్ణుడిగా, శ్రీరామాంజనేయ యుద్ధంలో శ్రీరాముడిగా, శ్రీకృష్ణతులాభారంలో నారదుడిగా, చింతామణి నాటకంలో బిల్వమంగళుడిగా, సత్యహరిశ్చంద్ర నాటకంలో నక్షత్రుకుడిగా వేలాది ప్రదర్శనలు చేసిన ఘనత ఆయన సొంతం. ముఖ్యంగా శ్రీకృష్ణ పాత్ర ఆయనకెంతో గుర్తింపునిచ్చింది. ముందుకాలంలో వారి అనంతర కాలంలో ఎందరో శ్రీకృష్ణ పాత్రని ఎంతో గొప్పగా పోషించినా షణ్ముఖి స్థానం మాత్రం అనితర సాధ్యం. ఒకేరోజు మూడు గ్రామాలలో మూడు వేదికలపైన శ్రీకృష్ణుడిగా నటించి, ప్రేక్షకులను మెప్పించిన గొప్ప నటుడాయన. సంగీతం ఆయనకు జన్మతః లభించిన వరం. ఒక్కో పద్యంలో ఒక్కో పాదాన్ని ఒక్కో రాగంలో పాడి క్షణంలో మరో రాగానికి మారిపోయేవారు. ఆయనకున్న సంగీత విద్వత్తు వల్ల రాగ సమ్మేళన ప్రతిభ వల్ల ఈ ప్రయోగాన్ని ఎంతో విజయవంతం చేసేవారు. గ్రామఫోను రికార్డింగ్ కంపెనీ ఆయన పద్యాలను రికార్డు చేసి విడుదల చేసింది. అవి బహుళ ప్రజాదరణ పొందాయి. ఆంజనేయరాజు నటనా ప్రతిభను ఎందరో అనేక విధాలుగా గౌరవించారు. గాన గంధర్వుడని, పౌరాణిక నాటక చక్రవర్తి అనీ, కలియుగ కృష్ణుడనీ కీర్తించారు. 1990లో మద్రాసు తెలుగు అకాడమీ బళ్ళారి రాఘవ అవార్డు ఇచ్చి సత్కరించింది. జీవితమంతా కళారంగంలోనే గడిపిన షణ్ముఖి ఆంజనేయరాజు చివరి నాటకం భీమవరం మావుళ్ళమ్మ ఉత్సవాల్లో ప్రదర్శించిన కురుక్షేత్రం. అప్పటికే ఆయన ఆరోగ్యం క్షీణించింది. అయితే తన కోసం ఎదరు చూసే ప్రేక్షకులను నిరుత్సాహ పర్చలేక శ్రీకృష్ణుడిగా నటించారు. 1997 ఫిబ్రవరి 18న భీష్మ ఏకాదశి రోజున దివంగతులయ్యారు. ఆయన భౌతికంగా జీవించి ఉండకపోయినా ఆయన పద్యం, నటన చిరకాలం నిలిచే ఉంటాయి.

-తణుకు (ఆంధ్రజ్యోతి)

నివాళి




ఏలూరు ప్రభుత్వాసుపత్రి

అంతా అధ్వానం, అపరిశుభ్రత దానికి తోడు వైద్యుల కొరత సమస్యలు వెంటాడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇచ్చే 2023-24 అవార్డులకు ప్రధాన ఆసుపత్రులు దూరమయ్యాయి. ఉమ్మడి పశ్చిమ జిల్లాలోని ఏలూరు నగరంలో ప్రధాన ఆసుపత్రి, భీమవరం పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి, తణుకు, పాలకొల్లు, నరసాపురం, ఆకివీడులోని ఆసుపత్రులు కాయకల్ప అవార్డులకు వెనుకంజలో ఉన్నాయి. నూజివీడు ఏరియా ఆసుపత్రి, తాడేపల్లి గూడెంలోని ఆసుపత్రి అవార్డులకు ఎంపికయ్యాయి.


భీమవరం ఆసుపత్రిలో మూలకు చేరిన విరిగిన మంచాలు

సమస్యల తిష్ఠ

అవార్డులకు ఎంపిక కాని ప్రధాన ఆసుపత్రులు

ఏలూరు ఆస్పత్రిలో వైద్యుల కొరత

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : ఏలూరు ప్రభుత్వా సుపత్రిలో యంత్రవైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి కానీ వైద్యులు కొరత వెంటాడుతోంది. అత్యాధునిక వైద్య పరిజ్ఞానంతో ఉన్న ఎంఆర్ఐ స్కాన్, సిటి స్కాన్ కూడా ఉంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిగా ఉన్నప్పుడు వైద్య విధానపరిషత్ ఆధీనంలో ఉండేది. అప్పట్లో రాష్ట్రస్థాయిలోనే రెండు పర్యాయాలు అవార్డులు సాధించగా జాతీయ స్థాయిలో రెండుసార్లు ప్రథమస్థానంలో అవార్డులను సాధించాయి. సీఎం చంద్రబాబునాయుడు కేంద్రమంత్రుల నుంచి అప్పటి ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్ అవార్డులను అందుకున్నారు. అంతకీర్తి గడించిన ఆసుపత్రిని టీచింగ్ ఆసుపత్రిగా మార్చడంతో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) పరిధిలోకి వెళ్ళిపోయింది. ప్రభుత్వం వైద్య పోస్టులు మంజూరు చేసినా ఆ పోస్టులు భర్తీ కాకపోవడంతో ఇక్కడ వైద్య సేవలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రజల్లో ఆసుపత్రిపై వ్యతిరేకత మొదలైంది.

పోస్టులు ఉన్నా ఖాళీగానే..

ఆసుపత్రిలో ఒక మెడికల్ సూపరింటెండెంట్, ఆరుగురు అత్యవసర విభాగపు వైద్యుల పోస్టులు మంజూరు అయ్యాయి. అత్యవసర విభాగానికి ఆరు మెడికల్ ఆఫీసర్ పోస్టులు ఉండగా, రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఉన్న నలుగురిలో ఇద్దరు మహిళా వైద్యులు మెటర్నిటీ లీవులో ఇటీవల వెళ్ళిపోవడంతో అత్యవసర విభాగంలో ఇద్దరు వైద్యులు ఉన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీకి 18 ప్రొఫెసర్ పోస్టులు మంజూరు కాగా తొమ్మిది మంది విధుల్లో చేరారు. అసోసియేట్ ప్రొఫెసర్స్ 37కు 27 మంది చేరారు. అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 51కి 36 మంది చేరారు.

వైద్యుల కొరత ఉంది



వైద్యసిబ్బంది కొరత సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళాం. వారి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో పరిధిలోని వైద్యులు వచ్చారు. ప్రస్తుతం క్యాజువాల్టీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఎంఎస్ రాజు, మెడికల్ సూపరింటెండెంట్

తణుకులో పారిశుధ్యం వీక్..


తణుకు ప్రభుత్వాసుపత్రి

తణుకు : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో అందించే వైద్య సేవలు భేషుగ్గా ఉంటాయనేది అందరి నోటా వినే మాట. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అనేక ప్రాంతాల్లోని రోగులు ఇక్కడకు వచ్చి వైద్యం పొందుతారు. అవార్డు ప్రామాణికంగా ఆసుపత్రిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రధాన లక్ష్యం. ఇక్కడ పారిశుధ్యం, పరిసరాల శుభ్రత లోపాలు ఎక్కువగా ఉండడంతో ఈసారి అవార్డుకు దూరమమైంది. ఈ ఆసుపత్రిలో కనీసం 32 మంది పారిశుధ్య కార్మికులు ఉండాలి.. ప్రస్తుతం 21 మంది ఉన్నారు. వీటితో పాటు సేవల పరంగా ట్రామా కేర్, ఐసీయూ, సిటి స్కాన్, ఎంఆర్ఐ, పార్కింగ్ (గ్రీన్ జోన్)వంటివి లేకపోవడం కారణంగా చెబుతున్నారు. ఆసుపత్రిలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవస్తంగా ఉంది. వార్డుల్లో వినియోగించే వ్యర్థ నీరు డ్రెయినేజీల ద్వారా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. ఆసుపత్రిలో స్కానింగ్ మిషన్ ఉంది. దానిని ఉపయోగించే రేడియాలజిస్టు లేరు. దీంతో గత నాలుగేళ్ల నుంచి మూలపడి ఉంది.

పారిశుధ్యం మెరుగుపర్చాలి



ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపర్చాలి.. సిబ్బంది తగినంత లేకపోవడం వల్ల వాళ్ళ పరిధికి మించి పనిచేస్తున్నారు. వంద పడకల ఆసుపత్రి సిబ్బంది 150 పడకల ఆసుపత్రికి పని చేస్తున్నారు. రానున్న రోజుల్లో మెరుగైన ఫలితాలు సాధనకు కృషి చేస్తాం.

– డాక్టర్ వెలగల అరుణ, సూపరింటెండెంట్

2022-23 అవార్డు ప్రోత్సాహ నగదు అందలేదు

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో 2022-23 ఏడాదికిగాను పరిశుభ్రతపై జాతీయస్థాయిలో నిర్వహించిన కాయకల్ప ప్రోగ్రాంలో జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రి మొదటి స్థానం పొంది అవార్డు అందుకున్నాం. ఈ అవార్డుతో పాటు రూ.20 లక్షల నగదు ప్రోత్సాహకం అందించాల్సి ఉండగా ఇప్పటివరకు అందజేయలేదు. ఈ ఏడాది కాయకల్ప బృందం తనిఖీలు చేయడంతో 97 శాతం మార్కులు పొందాం. 2022లో నేషనల్ క్వాలిటీ అస్యూరెన్సు (ఎన్‌క్వాస్) బృందం వారు అవార్డు అందించారని, దీనిలో భాగంగా ఏడాదికి రూ.పది లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.ముప్పై లక్షలు అందించాల్సి ఉండగా ఇప్పటికి ఒక్కసారి రూ.పది లక్షలు అందించారు.



– డాక్టర్ సీహెచ్.బేబీ కమల, సూపరిండెంటెంట్

భీమవరం ఆసుపత్రిలో అపరిశుభ్రతే సమస్య

భీమవరం క్రైం : భీమవరం పట్టణంలోని ప్రాంతీయ ఏరియా ఆసుపత్రి ఎంతో పేరుగాంచింది. కొన్ని అనివార్య కారణాల వల్ల వంద పడకల ఆసుపత్రికి నోచుకోలేదు. 2015లో అప్పటి ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న కామినేని శ్రీనివాస్ ఆసుపత్రి నూతన భవనానికి రూ.తొమ్మిది కోట్లు కేటాయించడంతో చాలా వరకు వసతులు సమకూరాయి. గత ప్రభుత్వ హయాంలో కొన్ని తప్పిదాల వల్ల ఆసుపత్రి పారిశుధ్యం విషయంలో చాలా ఇబ్బందులు తలెత్తాయి. ఆసుపత్రి మరుగుదొడ్డి, రోగులకు ఇచ్చే రూములు, మంచాలు, మార్చురీ రూము ఇలా అన్నీ అభివృద్ధికి నోచుకోలేదు. కొత్తగా వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వంలో కూడా ఎటువంటి మార్పులు లేవు. ఆసుపత్రి పెద్దది కావడం వల్ల పారిశుధ్యం విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి జీతాలు కూడా సరిగా ఇచ్చే పరిస్థితిలో లేరని చెబుతున్నారు. కొందరు స్పెషలిస్టు వైద్యులు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి కనిపించక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కలెక్టర్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్యులు అన్నివేళల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించినప్పటికీ వైద్యుల్లో ఎటువంటి మార్పు లేదు. కొన్ని రకాల మందులతో పాటు, రక్త పరీక్షలకు బయటకు పంపడం తదితర కారణాలతో ఆసుపత్రి అవార్డుకు నోచుకోలేదని ప్రచారం

89 శాతం స్కోర్ ఉన్నా ఎంపిక కాలేదు



భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్పలో 89శాతం స్కోర్ ఉంది. కానీ ప్రభుత్వం అవార్డు ఎంపిక చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదు. కొన్ని ఆసుపత్రులకు మాత్రమే అవార్డులు ఇచ్చారు. ఈ ఆసుపత్రి అన్ని విధాలుగా బాగానే ఉంది. భీమవరం ఆసుపత్రికి ముస్కాన్, ఇన్‌క్యూస్, లక్ష్య సర్టిఫికెట్లు కూడా దక్కాయి.

– డాక్టర్ మాధవి కళ్యాణి, ఆసుపత్రి సూపరింటెండెంట్

కాయకల్ప అవార్డులకు నూజివీడు, తాడేపల్లిగూడెం ఆసుపత్రులు


నూజివీడు ఏరియా ఆసుపత్రి


2019లో సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ నరేంద్రసింగ్

నూజివీడు ఆసుపత్రికి ఐదోసారి అవార్డు

నూజివీడు టౌన్ : జాతీయస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించిన ఆసుపత్రులకు ప్రదానం చేసే కాయకల్ప అవార్డుల్లో ఏలూరు జిల్లా నూజివీడు ఏరియా ఆసుపత్రి చోటుదక్కించుకుంది. దేశంలోని పలు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలతో పోటీపడి రాష్ట్రస్థాయిలో రెండోస్థానంలో నిలిచి అవార్డును అందుకుంది. ఆసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణ, అందిస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం ఏరియా ఆసుపత్రికి మరోసారి దక్కింది. రాష్ట్రంలోని ఏరియా ఆసుపత్రుల్లో నూజివీడు ఆసుపత్రి 2015 నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగుసార్లు కాయకల్ప అవార్డును అందుకోగా, ప్రస్తుత ఏడాది మరోసారి ఎంపికైంది. 2019లో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌ను పొందింది. ఇదేకాక 2019లో అప్పటి, ఇప్పటి సీఎం నారా చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ఉత్తమ ఏరియా ఆసుపత్రిగా అవార్డును అందుకుంది. వీటితో పాటు 2011 నుంచి ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అందుకునే అవార్డులను నూజివీడు ఏరియాఆసుపత్రి వరుసగా అందుకోవడం విశేషం.

అవార్డు రావడం ఆనందాన్నిచ్చింది..



నూజివీడు ఏరియా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడం ఆనందంగా ఉంది. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం అధికారుల నుంచి ఇంకా రావాల్సి ఉంది. ఇప్పటికి నాలుగుసార్లు కాయకల్ప అవార్డు అందుకోగా మరోసారి అవార్డుకు ఎంపిక కావడం విశేషం.

– నరేంద్రసింగ్, సూపరింటెండెంట్, నూజివీడు ఏరియా ఆసుపత్రి


తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి

తాడేపల్లిగూడెం ఆసుపత్రికి ఇదే ఫస్ట్

తాడేపల్లిగూడెం రూరల్ : రాష్ట్రంలోనే అత్యున్నత సేవలందించే ఆసుపత్రుల్లో ఒకటిగా తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి అవార్డు సొంతం చేసుకుంది. ఈ ఆసుపత్రి పరిశుభ్రతతో పాటు వైద్యసేవలు అంశాలపై సర్వే ఆధారంగా అందించే ఈ అవార్డు తాడేపల్లిగూడెంకు దక్కడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా ఉంచడంతో పాటు రోగులకు సేవలందించే విధానం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ అవార్డు అందుకోవడం ఇదే ప్రథమం. ఈ అవార్డుతోపాటు ప్రభుత్వం రూ.10లక్షలు నగదు ప్రభుత్వం అందిస్తుంది.

మెరుగైన సేవలకు కృషి చేస్తాం



రూ. పది లక్షల నగదును ఎమ్మెల్యే ఆసుపత్రి అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తాం. ట్రామా సెంటర్ అవసరం ఆ సెంటర్ ఏర్పాటుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సూచనల మేరకు పనిచేస్తాం. అత్యవసర సేవలు అందించేందుకు ఈ సెంటర్ ఏర్పాటుతో సుగమం అవుతుంది.

– ఏవీఆర్ఎస్ తాతారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటింటెండెంట్

ఆకివీడు ఆసుపత్రి సమస్యలమయం



ఆకివీడు : ఆకివీడు సామాజికి ఆరోగ్య కేంద్రాన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. 2001లో పీహెచ్‌సీగా ఏర్పడింది. 2011లో 30 పడకలతో సీహెచ్‌సీ ఏర్పాటు చేశారు .కొల్లేరు తీర ప్రాంతాలైన సుమారు 60 గ్రామాల ప్రజలు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతుంటారు. నేటికి ఈ ఆసుపత్రిలో పిల్లలు, మత్తుకు సంబంధించి వైద్యులు లేరు. ఫిజియో థెరపీకి టెక్నీషియన్ ఉన్నా పరికరాలు లేవు. ఎక్సరే, ఆర్థోపెడిక్, పోస్టుమార్టం తదితర సేవలు లేక పోవడంతో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటికి తోడు డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో శానిటేషన్ క్షీణించడం, సమీపంలోనే అనధికార డంపింగ్‌యార్డు ఉండడంతో ఆసుపత్రిలోకి ఈగలు, దోమలతో వ్యాధిగ్రస్తులు మరికొన్ని రోగాలు బారినపడుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



ఆసుపత్రి సమస్యలు ఉన్నతాధికారులు, పాలకులు దృష్టికి తీసుకెళ్ళాం. సమీపంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన ఆసుపత్రిని ప్రారంభిస్తే మరింత అభివృద్ధి చెందుతుంది. డ్రెయినేజీ, అనధికార డంపింగ్‌తో వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– అచ్యుత్ గణేశ్వరరావు, సూపరింటెండెంట్, ఆకివీడు

స్థాయి పెరిగినా.. సమస్యలెన్నో..


నరసాపురం ఆసుపత్రి

నరసాపురం : తీరంలో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో 50 నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ అయినా.. దానికి తగ్గట్టుగా సౌకర్యాలు మెరుగుపడలేదు. వైద్యుల సంఖ్య పెరిగినా.. శానిటేషన్ సిబ్బంది కొరత మాత్రం తీరలేదు. 23 మంది వైద్యులకు గాను ప్రస్తుతం 19 మంది పని చేస్తున్నారు. రేడియాలజిస్టు లేకపోవడంతో స్కానింగ్ సెంటర్ అందుబాటులో లేదు. డిప్యూటీ సర్జన్, ఇంకా ఇద్దరు జనరల్ మెడిసన్ వైద్యుల్ని భర్తీ చేయాల్సి ఉంది. నెలవారీగా డెలివరీ కేసులు 60 నుంచి 80కి పెరిగాయి. ఇక ఇద్దరు సర్జన్లు ఉండడంతో అపరేషన్ల సంఖ్య 60 దాటింది. ఈ ఆస్పత్రికి 2016, 2021లో రెండుసార్లు అవార్డులు దక్కాయి. ఈసారి కేంద్రం ఇచ్చే అవార్డుకు నాలుగు పాయింట్లు దూరంగా నిలిచింది.

వచ్చే ఏడాది సాధిస్తాం..



కమిటీ ఆస్పత్రిని సందర్శించే సమయంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు, కొత్త ఆస్పత్రి ప్రారంభమైన కొన్ని పనులు పెండింగ్ ఉండడం వల్ల పాత భవనంలోనే కొన్ని విభాగాలు నిర్వహిస్తూ వచ్చాం. వచ్చే ఏడాదినాటికి పెండింగ్‌వన్ని పూర్తి చేసుకుని అవార్డు దక్కించుకుంటాం.

డాక్టర్ సుప్రియ, అస్పత్రి సూపరింటెండెంట్


తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టడానికి వెళుతున్న పెద్ద కుమార్తె రితిక

తండ్రి మృతదేహానికి కుమార్తె అంత్యక్రియలు

పాలకొల్లు అర్బన్, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): పాలకొల్లు పట్టణంలో హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన లారీ డ్రైవర్ పోతంశెట్టి సూర్య నారాయణ(45) గుండెపోటుతో శనివారం ఉదయం మరణించాడు. ఆయనకు భార్య ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో ఇంటర్ చదువుతున్న పెద్ద కుమార్తె రితిక తండ్రి మృతదేహం వెంట వెళ్లి అంత్యక్రియల్లో భాగంగా మృత దేహానికి దహన సంస్కారాలు చేసింది. ఈ ఘటన స్థానికులను కలచి వేసింది.

దంపతులకు గాయాలు

పోలవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కన్నాపురం అడ్డరోడ్డు జంక్షన్‌లో శనివారం జరిగిన బైకు ప్రమాదంలో మత్స్యకార కుటుంబానికి చెందిన దంపతులు గాయాలపాలయ్యారు. దొండపూడికి చేపల అమ్మకానికి వెళ్ళి తిరిగి వస్తూ జంక్షన్ వద్ద పట్టిసీమ వైపు మలుపు తిరిగే క్రమంలో రోడ్డు మార్జిన్ సరిగా లేకపోవడంతో బైకు కిందకు పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు వారికి ప్రథమ చికిత్స అందించారు.

క్రైమ్ కార్నర్


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న ఇల్లు

షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధం

లింగపాలెం, నవంబరు30, (ఆంధ్రజ్యోతి) : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన లింగపాలెం మండలం యడవల్లిలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన గజ్జల దుర్గారావుకు చెందిన తాటాకిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు, ఫైర్‌సిబ్బందికి సమాచారమందించారు. ఫైర్ సిబ్బంది స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. సైకిల్ మెకానిక్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తూ, పొలంలో వరికోత వద్దకు వెళ్లి వచ్చేసరికి ఈ ఘటన జరిగిందన్నారు. తన భార్య దివ్యాంగుల పింఛన్ సొమ్ములు రూ.6 వేలతో పాటు ఇంట్లో వున్న రూ.4 వేల నగదు, బంగారం, సామగ్రి దగ్ధమయ్యాయని కట్టుబట్టలతో మిగిలా మని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ప్రమాదంలో రూ. 2 లక్షల ఆస్తినష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ తోట కోటేశ్వరరావు తెలిపారు. ఫైర్‌సిబ్బంది పి.రామకృష్ణ, శివకృష్ణ, రవికుమార్ మంటలను అదుపుచేశారు.

కువైట్ నుంచి దేవ గ్రామానికి మృతదేహం రాక


చినబాబు (ఫైల్)

పెనుగొండ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం కువైట్ దేశం వెళ్ళిన గూనపాటి చిన బాబు(40) కువైట్ దేశంలో నవంబరు 27వ తేదీన గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో చినబాబు మృతదేహం కువైట్ నుంచి శనివారం సాయంత్రానికి పెనుగొండ మండలం దేవ గ్రామానికి చేరుకుంది. అతడి మృతదేహాన్ని చూసి భార్య, ఇద్దరు కుమారులు, తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం క్రైస్తవ సంప్రదాయం ప్రకారం అతడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

ఆగిన లారీని ఢీకొట్టిన బైక్.. ఒకరి మృతి


లారీ కిందకు దూసుకెళ్లిన బైక్.. (ఇన్‌సెట్‌లో) మృతి చెందిన పైడిరాజు

కాళ్ళ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆగి ఉన్న లారీని ద్విచక్ర వాహనదారుడైన యువకుడు ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శనివారం కాళ్ళ మండలం సీసలిలో చోటు చేసుకుంది. కాళ్ళ పోలీసులు తెలిపిన వివరాలివి.. జువ్వలపాలెం గ్రామానికి చెందిన ముంజేటి పైడిరాజు అలియాస్ (25), చోడవరపు మధుబాబు శనివారం ఉదయం మోటార్ సైకిల్‌పై ఎల్ఎన్‌పురం గ్రామానికి చేపల ప్యాకింగ్ పనినిమిత్తం వెళ్తున్నారు. సీసలి గ్రామానికి వచ్చేసరికి రైస్‌మిల్ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ నడుపుతున్న పైడిరాజు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చున్న మధుబాబుకు గాయాలవ్వడంతో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి అన్నయ్య నారాయణరావు ఫిర్యాదు మేరకు కాళ్ళ ఎస్ఐ ఎన్. శ్రీనివాసరావు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

బైక్ డిక్కీలో పెట్టిన రూ.2.5 లక్షలు కొట్టేశారు

» నిందితుడిని అరెస్ట్ చేసి సొమ్ము స్వాధీనం చేసుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్, తదితరులు

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో నగదు డ్రా చేసుకుని ఆ సొమ్మును ద్విచక్ర వాహనంలో ఉంచి పనిచూసుకుని వచ్చేలోపల ఆ సొమ్మును అపహరించుకుపోయిన వ్యక్తిని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి మొత్తం సొమ్మును స్వాధీనం చేశారని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. శనివారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీతోపాటు భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం. నాగులపల్లికి చెందిన నందమూరి సత్యనారాయణ వ్యవసాయం చేసి జీవిస్తున్నారు. ఆయన భీమడోలులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి బ్యాంకులోని సేవింగ్ ఖాతా నుంచి రెండున్నరలక్షల రూపాయలు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ సొమ్మును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని, దగ్గరలోని నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు షాపులోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి డిక్కీలో సొమ్ము అపహరణకు గురైంది. ఈ ఘటనపై వెంటనే భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ వారి సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారు. మొత్తం మీద ఈ నేరానికి పాల్పడిన భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన సప్పా రాముని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర లక్షల రూపాయల నగదును స్వాధీనం చేశారు. నిందితుడికి అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐలను వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఊరెళ్లి వచ్చేసరికి దోచేశారు

» నగదు, వెండి వస్తువుల చోరీ

ఉండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో దొంగలు పడి రూ.13 వేలు నగదు.. పలు విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి పోలీసులు తెలిపిన వివరాలివి.. ఉండి మండలం ఎస్ఆర్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన బీఎస్‌బీఆర్ సూర్యనారాయణ నెలరోజుల క్రితం ఇంటికి తాళం వేసి గ్రామ విడిచి మరో ఊరు వెళ్లారు. తిరిగి శనివారం ఊరు వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి వుండడం, ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా ఉండడంతో పరిశీలించారు. బీరువాలోని రూ.13వేలు నగదు, విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ డీవీ శ్రీనివాస్ తెలిపారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

భీమవరం క్రైం, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : ఒక బ్యాంక్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్న తనపై నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారంటూ ఆదర్శనగర్‌కు చెందిన ఆకివీటి సుబ్రహ్మణ్యం శనివారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుబ్రహ్మణ్యం మరో ఇద్దరు కలిసి ఈనెల 29వ తేదీన రాత్రి హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక బ్యాంక్ వద్ద సెక్యూరిటీ నిర్వహిస్తున్నారు. రెండు ద్విచక్ర వాహనాలపై తాడి లక్ష్మణ్‌కుమార్, ఇందుకూరి అజయ్‌వర్మ, పవన్ కళ్యాణ్, మల్లుల సుమంత్ అనేవారు వేగంగా వెళుతున్నారు. ఆ సమయంలో సుబ్రహ్మణ్యం అంతవేగం ఎందుకు అని తెలుపగా ఆ నలుగురు వచ్చి అతడిపై దాడి చేసి గాయపరిచి బూతులు తిటారు. గాయపడిన వ్యక్తిని తోటి సెక్యూరిటీ గార్డులు ఆసుపత్రిలో చేర్చారు. అతడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ తెలిపారు.

ఒకరిపై పోక్సో కేసు

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భర్తతో విడాకులు పొందిన ఓ మహిళతో సహజీవ నం చేస్తున్న వ్యక్తి ఆ మహిళ కుమార్తె బాలికపై అసభ్యంగా ప్రవర్తించడంతో అతడిపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోక్సో కేసు నమోదైంది. వివరాలివి.. విశాఖపట్టణానికి చెందిన కాలి మహంతిరాజు ఓ ప్రైవేటు కంపెనీలో మార్కె టింగ్ చేస్తూ ఉంటాడు. అతడికి ఏలూరు బదిలీ అయింది. భర్తకు విడాకులు ఇచ్చిన ఓ మహిళతో అతడికి పరిచయం ఏర్పడి ఆమెతో పాటు ఏలూరు వచ్చి ఉంటున్నాడు. ఆమెకు అప్పటికే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమెతో సహజీవనం చేస్తూ ఆమె కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలి మహంతిరాజుపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల : కన్నాపురంలో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో శనివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని ద్వారకాతిరుమల పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ. 3,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



వార్షికోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : క్రీస్తు బోధనలు సమాజాన్ని మంచి మార్గంలో నిలుపుతాయని, వ్యక్తులను సన్మార్గంలో నడిపించడానికి దోహదపడతాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. జగన్నాథపురంలో శనివారం జరిగిన బెయెర్షెబా ప్రార్థనా మందిరం 24వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రభాకర్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుచరణీయమని, ప్రతిఒక్కరూ ఆచరించాలన్నారు. ప్రార్థనా మందిరం వ్యవస్థాపకుడు బ్రదర్ కె.సాల్మన్‌రాజు, బ్రదర్ కె.గాంధీ, గ్రామస్తులు కె.నానాజీ, సీహెచ్.రమేష్, విశ్వాసులు పాల్గొన్నారు.

చిన్నారుల సంక్షేమమే లక్ష్యం

పెదవేగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా అంగన్‌వాడీ సిబ్బంది పని చేయాలని పెదపాడు సీడీపీవో కె.విజయలక్ష్మి అన్నారు. పెదవేగిలో శనివారం జరిగిన అంగన్‌వాడీ పెదవేగి సెక్టార్ సమావేశంలో చిన్నారుల ఆరోగ్య సంరక్షణ, పూర్వ ప్రాథమిక విద్యకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆమె మాట్లాడుతూ మూడేళ్ళు నిండిన ప్రతి చిన్నారిని పూర్వ ప్రాథమిక విద్యకు సిద్ధం చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా పిల్లల ఎత్తు, బరువు సరిచూడాలన్నారు. ఈసీసీఈ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, పెదవేగి సెక్టారు సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంప్యూటర్ సెక్యూరిటీ దినోత్సవం

జంగారెడ్డిగూడెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ కంప్యూటర్ సెక్యూరిటీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి సమాజమంతా కంప్యూటర్ రంగంపైనే ఆధారపడి ఉందన్నారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు. శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో వారం రోజులుగా జరుగుతున్న సోషల్ వీక్ కార్యక్రమం శనివారం ఫుడ్ ఫెస్టివల్‌తో ఘనంగా ముగిసింది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ వస్త్రధారణలతో సాంస్కృతిక కార్యక్రమాలతో చిన్నారులు అలరించారు. ఆర్ఐ ఉదయ్ భాస్కర్, ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్, ఏవో కె.శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జి రజనీరాణి పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వండి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):కొత్త వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు వెంటనే మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నేభవనంలో శనివారం వారు వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల సమస్యపై చర్చించారు. జిల్లాలో 720 కొత్త వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయకపోవడం వలన రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన వైద్యం అందించే ప్రభుత్వ లక్ష్యంలో ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు కూడా భాగస్వాములేనని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఏలూరుబ్రాంచి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ డి.బసవరాజు నేతృత్వంలోని కార్య వర్గం ప్రమాణస్వీకారం ఐఎంఏ హాల్లో శనివారం జరిగింది. ఐఎంఏ కార్యదర్శిగా డాక్టర్ పి.నాగేంద్ర బాబు, కోశాధికారి డాక్టర్ ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు డాక్టర్ కె.సత్యనారాయణ, డాక్టర్ జి.నాగభూషణం, ఇతర కార్యవర్గ సభ్యులతో ప్రస్తుత అధ్యక్షుడు డాక్టర్ సదాశివరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యేను సత్కరించారు. వైద్య నిపుణులు ఎం.రమేష్ చంద్రశేఖర్, డి.వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

డీపీఆర్టీయూ నాయకుల ప్రచారం

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తున్న గంధం నారాయణ రావుకు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు డెమొక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తెలిపారు. నారాయణరావు అభ్యర్థిత్వానికి మద్దతుగా శనివారం ఏలూరు, గుండుగొలను, భీమడోలు, అనంతపల్లి, నల్లజర్ల మండలాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. సంఘనాయకులు ఎం.అచ్యుతరావు, టి.శ్రీనివాస్, వీరబాబు, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మూర్తి

ద్వారకాతిరుమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి మండలంలోని పంగిడి గూడెం, గుణ్ణంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శనివారం ప్రచారం నిర్వహించారు. తనకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తాపాలీ, రవికుమార్, సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కంటిమీద కునుకు లేదు

» అక్కడక్కడా జల్లులు » ఆందోళనలో అన్నదాతలు » పంటను కాపాడుకునేందుకు అవస్థలు

ఈ ఏడాది రెండుసార్లు అధిక వర్షాలు దాటుకుని పంట చేతికి వచ్చే సమయంలో ఈ తుపాను తమకు నష్టాన్ని తీసుకువస్తుందా అని రైతులు ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వ హెచ్చరికలతో అధికారులు గ్రామాల్లో తిరుగుతూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఇప్పటివరకు మూడో వంతు పంట చేతికి వచ్చింది. మరో 15 రోజులు వాతావరణం బాగుంటే పూర్తిగా వరి కోతలు పూర్తయ్యేవి. ఇంకా కల్లాలపై ఉన్న ధాన్యం కాపాడుకోవడానికి రైతులు కాపలా కాస్తున్నారు. చినుకుపడితే బరకాలు కప్పి వర్షానికి ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



పోలసానపల్లిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న నాయకులు



లింగపాలెంలో ధాన్యాన్ని ఒబిడి చేసుకుంటున్న రైతులు

ఏలూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలంలో మూడు, నాలుగు రోజుల నుంచి వరిపైరు కోతకోసిన పొలాల్లో పనలను కుప్పలువేసి నూర్పిళ్ళు మొదలు పెట్టారు. కొన్నిచోట్ల పూర్తిగా పనలు ఎండకపోయినప్పటికి వర్షంపడితే తడిచిపోతాయనే ఉద్దేశంతో ఆదరాబాదరాగా ఎత్తు ప్రదేశాల్లో కుప్పలు వేశారు. శనివారం కురిసిన వర్షానికి తడవకుండా వరి కుప్పలపై టార్పాలిన్‌లు కప్పారు. ఉదయం వ్యవసాయశాఖ జేడీ హబీబ్‌బాష, ఏవో ఎ.జీవనసంధ్య వరి కోతలను పరిశీలించారు. కోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ముందుగా కోసిన పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించుకుని టార్పాలిన్ కప్పి కాపాడుకోవాలన్నారు.

● చింతలపూడి : తుఫాను హెచ్చరికలతో చింతలపూడి సబ్ డివిజన్‌లోని వరి రైతులు అప్రమత్తమవుతున్నారు. ఇప్పటివరకు సబ్ డివిజన్‌లో 25 వేల ఎకరాల్లో వరి సాగు చేస్తే 7 వేల 600 ఎకరాల్లో మాత్రమే కోతలు జరిగాయి. పది వేల టన్నులు మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ఇందులో చింతలపూడి మండలం లోనే అధిక భాగం 13 వేల 500 ఎకరాల్లో వరి పంట పండిస్తున్నారు. మార్కెట్ కమిటీల ద్వారా బరకాలు అందించ డానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు సమాచారం. దీనిపై వ్యవసాయాధి కారులను ప్రశ్నించగా ధాన్యం తడవకుండా కాపా డుకోవాలని, వరి కోతలు మాత్రం ముసురు వీడే వరకు చేపట్టవద్దని సూచి స్తున్నారు. అయితే అనుకోని సమయంలో భారీ వర్షం పడితే కోయని వరి పంట పరిస్థితి ఏమిటనే ఆందోళన కూడా ఉంది.

● భీమడోలు : తుపాను కారణంగా కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, శ్రీనివాసు కోరారు. భీమడోలు, పోలసానపల్లి గ్రామాల్లో శనివారం పర్యటించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించారు. తుపాను కారణంగా అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. రైతులు పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి : తుపాను ప్రభావంతో మండలంలో అక్కడక్కడ జల్లులు పడ్డాయి. దీంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. అంకంపాలెం, బర్రింకలపాడు, వంకవారిగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో వేరుశనగ పంట ప్రస్తుతం తీత (పనలు)దశలో ఉన్నాయి. రెండు రోజులపాటు వర్షంలేకపోతే పంట నష్టపోకుండా ఉంటామని రైతులు చెబుతున్నారు. మరోవైపు పొగాకు నాట్లు ముమ్మరంగా సాగే క్రమంలో వాతావరణం పరిస్థితులు రైతుల్ని కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. కొందరు పొగాకు నాట్లు వేసే పనులు వాయిదా వేశారు.

● లింగపాలెం : పంట చేతికి వచ్చే సమయంలో తుపాను రావడంతో రైతులు ఆందోళనకు గురౌతున్నారు. వర్షాలు పడితే చేతికి వచ్చిన పంట పాడవుతుందని తీవ్ర నష్టం కలగుతుందంటున్నారు. కొందరు రైతులు తక్కు వ ధరకే పంటను విక్రయిస్తున్నారు. రైతులు వరి కోతలకు తొందర పడుతుంటే వరికోత మిషన్‌ల యజమానులు మాత్రం డిమాండ్‌ను బట్టి అధిక ధరలు వసూలు చేస్తున్నారు.

● కామవరపుకోట : మండలంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దట్టమైన మబ్బు కమ్మి ఉండగా 3 గంటల నుంచి ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు అప్రమత్తమయ్యారు. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని భద్రపర్చుకునేందుకు సన్నాహాలు చేశారు. వరి కుప్పలు వేసుకున్నారు. ఈ వర్షం వరి పంటకు తీవ్ర నష్టమని అన్నదాతలు పేర్కొన్నారు.

● పోలవరం: మండలంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం పూర్తిగా మారి పోవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. గూటాల, కొత్తపట్టిసీమ, పోలవరం, ప్రగడపల్లిలలో కోసి నూర్పిన పంటలను వర్షా ప్రభావంతో దళారులకు తెగనమ్ముకుంటున్నారు.మరికొంత మంది రైతులు బరకాలు కప్పి భద్రపరుచుకుంటున్నారు.

అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి

ఎమ్మెల్యే రోషన్‌కుమార్

లింగపాలెం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): అధికారులు, వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. తుపాను ప్రభావంతో వరి రైతులు ఆందోళన పడుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు త్వరగా చేపట్టాలని రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. తుపాను కారణంగా ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

యువత అవకాశాలను వినియోగించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కామవరపుకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో తడికలపూడిలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో శనివారం చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ 162 మంది నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు, రాత పరీక్ష నిర్వహించారు. గ్రామాల్లో ఇంగ్లీషు భాషలో పట్టు, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండి ఉద్యోగ అవకాశాలు లేని వారికి అవకాశం కల్పించడం తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. హైదరాబాదులోని ఒక ప్రైవేటు కంపెనీతో మాట్లాడి ఈ కార్యక్రమం నిర్వహించానన్నారు. విదేశాలకు వెళ్లే ఆసక్తి గల వారికి కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా ఉండాలనే విషయంపై వివరించారు. మోటివేషన్స్ స్పిరిట్ ఏవిధంగా ఉండాలి, ఆంగ్ల పరిజ్ఞానంపై అవగాహన ఉండి మాట్లాడతారా అనే అంశాలతో ఇంటర్వ్యూలు జరిపారు. రాత పరీక్షలు కూడా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్‌లు కోనేరు వెంకట సుబ్బారావు, తూతా లక్ష్మణరావు, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బొంతు వెంకటేశ్వరరావు, ఖాన్ వజీర్, టీడీపీ నేతలు బొప్పన అంజియ్య, డోలా విజయ్, మద్దిపోటి నాగేశ్వర రాంబాబు, మరీదు వెంకట్రా వు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం

లింగపాలెం:నిరుద్యోగుల యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ధర్మాజీగూడెం శ్రీవిద్య పాఠశాలలో ఇంటర్ ఆపైన చదివిన నిరుద్యోగ యువతకు పలు కంపెనీల ప్రతినిధులతో కలసి ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిభ కనపరిచిన వారి వివరాలను ఆయా కంపెనీల ప్రతినిధులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

చినవెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ద్వారకాతిరుమల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గోవింద నామస్మరణలతో చినవెంకన్న క్షేత్రం శనివారం మార్మోగింది. దాదాపు 20 వేల మంది భక్తులు శ్రీవారు, అమ్మవార్లను దర్శించినట్లు ఆలయ వర్గాలు భావిస్తున్నాయి. సాయంత్రం వరకూ భక్తుల రద్దీ కొనసాగింది.

గురజాడ వర్ధంతి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యుగకర్త, మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ సమాజంలోని దురాచారాలను, మూఢనమ్మకాలను రూపుమాపడానికి సాహిత్యాన్ని ఆయుధంగా చేసుకుని పోరాడిన యోధుడు గురజాడ అని కొనియాడారు. సీపీడీసీ మెంబరు ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కన్యాశుల్కం వంటి నాటకాన్ని, దేశభక్తిలాంటి గేయాన్ని రచించి తెలుగు సాహిత్యంలో యుగకర్తగా నిలిచారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : సమాజంలోని సాంఘిక దురాచారాలను తన రచనలు ద్వారా ఖండించిన కవి శేఖరుడు గురజాడ అప్పారావు అని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ మిశ్రా అన్నారు. గురజాడ అప్పారావు 109వ వర్ధంతిని స్కూల్లో శనివారం నిర్వహించారు. సమాజాన్ని ప్రభావితం చేసిన ఆయన రచనలు అంటరానితనం, సమాజ అసమానతలు, రుగ్మతులను ఎండగట్టాయన్నారు. గురజాడ అరుణ(అమెరికా), ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ, గురజాడ ఫౌండేషన్ అమెరికా తెలుగు శాఖ అధ్యక్షులు జి.రమణమ్మ కార్యక్రమాన్ని నిర్వహించగా డాక్టరు పీబీజీ సుచరిత అధ్యక్షత వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ హామీ నెరవేర్చుతున్నాం : ఎమ్మెల్యే మద్దిపాటి



జి.కొత్తపల్లిలో పింఛను ఇస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

ద్వారకాతిరుమల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గడువుకు రోజు ముందే పింఛన్ పంపిణీ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శనివారం ఆయన ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల ముందు తమ ప్రభుత్వం ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చుతున్నామన్నారు. పోలిన శ్రీను, రేగంటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : మండలంలో 90 శాతం పైగా పింఛన్లు పంపిణీ చేశామని, మిగిలిన లబ్ధిదారులకు సోమవారం అందజేస్తామని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు.

● దెందులూరు : మండలంలో 96 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.నారాయణప్రసాద్ (మిల్లుబాబు), అధికారులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : మండలంలో 92.87 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ తెలిపారు. 11, 446 మందికి పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయింత్రానికి 10, 630 మందికి పంపిణీ పూర్తి చేశామన్నారు.

వీఆర్వోలపై పనిఒత్తిడి తగ్గించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న వీఆర్వోల సంఘ ప్రతినిధులు

ఏలూరు రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీఆర్వోల పై ఒత్తిడి పెంచవద్దంటూ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీరామచంద్రమూర్తి (రాంబాబు) తదితర నాయకులతో కలిసి కలెక్టర్ కె.వెట్రిసెల్విని కలిసి వినతిపత్రం అందచేశారు. రవీంద్రరాజు మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధం లేని వివిధ రకాల పనులు చేయాలని, పంచాయతీ సెక్రటరీలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఖాళీగావున్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులు అర్హులైన వీఆర్వోలతో భర్తీ చేయాలని కోరారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, రవీంద్రరాజు తెలిపారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావును కలిసి వీఆర్వోల సమస్యలను తెలిపారు. డి.రవికుమార్, ఏలూరు డివిజన్ అధ్యక్షుడు సాయిల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఇతర శాఖల పనులు కేటాయించవద్దు

వీఆర్వోలకు ఇతర శాఖల పనులు కేటాయించవద్దని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీఎస్‌ఆర్ రామచంద్రమూర్తి విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజును కలిసి నాయకులు వినతిపత్రం అందచేశారు. సమస్యను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువెళ్ళాలని కోరారు. నాయకులు మాట్లాడుతూ వీఆర్వోలకు సంబంధం లేని విధుల్లో కూడా భాగస్వాములను చేస్తున్నారని వాపోయారు. పి.అజయ్, సాయిల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆయుధ కర్మాగారం నిర్మాణం దుర్మార్గమైన చర్య

బుట్టాయగూడెం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెంలో నిర్మించనున్న అణు ఆయుధ కర్మాగార నిర్మాణ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కితీసుకోవాలని సీపీఐ మండల కన్వీనర్ సీహెచ్.దుర్గ శనివారం డిమాండ్ చేశారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలను నీరుగారుస్తూ ఆయుధ కర్మాగారాన్ని నిర్మించాలను కోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏజెన్సీలోని గిరిజనులు ప్రాజెక్టులు, కాల్వలతో పేరుతో వందలాది ఎకరాలను పోగొట్టుకున్నారని, కర్మగారాన్ని నిర్మించడం వలన స్వేచ్ఛగా జీవంచే హక్కును కోల్పోతారని, ఆంక్షలతో జీవితాలను అనుభవించవలసి వస్తుందని అన్నారు. బయట ప్రాంతాల్లో వందలాది ఎకరాలు భూమి అందుబాటులో ఉన్నా ఏజెన్సీ లోనే ఎందుకు నిర్మించాలను కుంటున్నారో అర్థం కావడంలేదని మండిపడ్డారు. అమాయక గిరిజనులు ప్రశ్నించరనే, కర్మగారాన్ని నిర్మించడానికి పూనుకున్నారని తెలిపారు. ఆయుధ కర్మగారాన్ని నిర్మాణానికి విరమించుకోవాలని లేకుంటే దశలవారిగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు బి.కిషోర్, టి.మునేశ్వరావు, ఎం.గంగరాజు, ఎస్.దుర్గమ్మ, పి.దుర్గారావ పాల్గొన్నారు.

టీచర్లకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆంజనేయులు

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొన్న టీచర్లకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలని కలెక్టర్ వెట్రి సెల్వికి వినతిపత్రం అందజేసినట్టు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఎలక్షన్ డ్యూటీ చేసిన రోజులన్నింటికీ సంబంధిత హాజరు ధ్రువీకరణ పత్రం ద్వారా మాత్రమే ఉపాధ్యాయులకు సంపాదిత సెలవులు మంజూరవుతాయని కలెక్టర్‌కు వివరించగా, వెంటనే స్పందించిన ఆమె జిల్లా రెవెన్యూ అధికారిని పిలిపించి తగిన ఆదేశాలు కూడా జారీ చేశారని తెలిపారు. వీటితో పాటు మరికొన్ని సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళామన్నారు.

గుడ్ టచ్.. బాడ్ టచ్ తెలుసుకోవాలి

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని కాలేజీలు, స్కూల్స్‌లో మహిళా ఎస్ఐ కాంతిప్రియ సిబ్బందితో కలిసి శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ ఎం.సుబ్బారావు, ఎస్ఐ కాంతి ప్రియ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని పలు కేసులను వివరించి జరిగే అనర్థాలను తెలియజేశారు.

కామేశ్వరరావు విగ్రహావిష్కరణ

ఏలూరు టూ టౌన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురం సబ్‌స్టేషన్ విద్యుత్ ఉద్యోగుల యూనియన్ నాయకులు సూర్యకా మేశ్వరరావు విగ్రహావిష్కరణ కార్యక్రమం శనివారం జరిగింది. అన్నారు. సూపరిండెంటెండ్ పి.సాల్మన్‌రాజు మాట్లాడుతూ నిరంతరం కార్మికుల సంక్షేమం కోసం పాటుపడిన వ్యక్తి కామేశ్వరరావు అని కొనియాడారు. ఏపీ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు నాయక్ ఏఈ కేఎం అంబేడ్కర్, యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన



చింతలపూడిలో ఎయిడ్స్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకుని శనివారం నగరంలో పలుచోట్ల అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించిన సదస్సులో డీఎంహెచ్‌వో కార్యాలయ ఎయిడ్స్ విభాగం అవుట్ రీచ్ వర్కర్ రామకృష్ణ మాట్లాడు తూ ఎయిడ్స్ వైరస్ కేసు బయటపడి మూడు దశాబ్దాలు దాటినా ప్రజల్లో ఇప్పటికీ హెచ్ఐవీపై అపోహలు, సందేహాలు ఉన్నాయన్నారు. ర్యాలీలో సుమారు 700 మంది విద్యార్థినులు పాల్గొని ఎయిడ్స్ సంకేతంగా ఏర్పడి ప్రదర్శన చేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్‌ప్రిన్సిపాల్ సిస్టర్ మరియా క్రిస్టియా, అధ్యాపకులు పాల్గొన్నారు. కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీకళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోస్టర్ మేకింగ్, రంగోలి, వక్తృత్వం అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు, సీపీడీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ (డాప్‌క్యూ) ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో కార్యాలయ ప్రాంగణంలో రంగోలి పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు. అనంతరం కొవ్వొత్తులతో ఎయిడ్స్ మృతులకు సంతాప సూచకంగా ప్రదర్శన నిర్వహించారు. డాప్‌క్యూ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ బాలాజీ, సూపర్‌వైజర్ హరినాథరావు, ఏఆర్టీ సిబ్బంది, ఎన్జీవోల ప్రతినిధులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు : నారాయణపురం డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు, కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం అధిపతి జి.హెప్సీబా, చేబ్రోలు పీహెచ్‌సీ సిబ్బంది వెంకన్నబాబు, రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ జి.నిర్మల కుమారి, ఎకడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ కె.రవి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ రెడ్డియ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

● చింతలపూడి : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లు ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన చేసుకుని ఇతరులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ జి.జీవన్‌మౌనిక, క్యాడెట్లు సదస్సులో తమ అభిప్రాయాలు తెలిపారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

భీమడోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మాధురి డిగ్రీ కళాశాల విద్యార్థులకు ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సమాజాన్ని మాదకద్రవ్యాల రహిత సమాజంగా మార్చాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సూచించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కళాశాల కరస్పాండెంట్ ప్రేమ్‌కుమార్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శివధర్, కేసరి, బాలు పాల్గొన్నారు.

భద్రాచలంకు పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న టీడీపీ నాయకులు

కుక్కునూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రి అయినందుకుగానూ విశాఖపట్నం 69వ వార్డు కార్పొరేటర్ కె.గోవింద రెడ్డి భద్రాచలంకు పాదయాత్ర చేపట్టారు. విశాఖ జిల్లా తుంగ్లంలోని రామాలయం నుంచి భద్రాచలం రామాలయం వరకు పాదయాత్ర చేస్తున్నారు. కుక్కునూరు మీదుగా శనివారం భద్రాచలం వెళ్తూ విలేకర్లతో మాట్లాడారు. చంద్రబాబు జైలు నుంచి విడుదలై ముఖ్యమంత్రి కావాలని సీతారామచంద్రులను వేడుకున్నట్లు తెలిపారు. తన కోరిక నెరవేరడంతో 11 రోజులుగా దాదాపు 360 కిలోమీటర్లు పాదయాత్ర సాగిందన్నారు. ఈ క్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, కె.సత్యనారాయణ, శ్రీను, చుంచు సత్యనారాయణ తదితరులు స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.

చట్టాలపై అవగాహన

కామవరపుకోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కెరీర్ గైడెన్స్ విభాగం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు చట్టాల గురించి వివరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు తెలిపారు. సమస్య సాధనకు ఏ విధంగా వ్యవహరించాలో తెలిపారు. న్యాయవాది ఇ.వెంకటేశ్వరరావు సమాచార హక్కు చట్టం, విద్యా హక్కు చట్టాలపై అవగాహన కల్పించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి ప్రారంభం

పెదవేగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : గ్రామంలోని ఎస్ఎంసీ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని ఆదివారం ఉదయం ప్రారంభిస్తున్నామని ఎస్ఎంసీ హైస్కూల్ కరస్పాండెంట్ సీహెచ్.అవినాష్‌రాజు తెలిపారు. ఈ ఆస్పత్రిలో అన్నిరకాల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడమే ఎస్ఎంసీ ఆస్పత్రి లక్ష్యమన్నారు.

16న మూర్తిరాజు నాలెడ్జి సెంటరు ప్రారంభం

ఏలూరు అర్బన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాదాత చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు నిడమర్రు మండలం పెదనింద్రకొలనులో నిర్మించిన మహాత్మాగాంధీ భవనాన్ని విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇ.ప్రసాదరాజు తెలిపారు. శాస్త్ర, సాంకేతిక అంశాలతో కూడిన ప్రాజెక్టుల నమూనాలు ప్రదర్శనగా ఏర్పాటుచేస్తామన్నారు. డిసెంబరు 16న మూర్తిరాజు 106వ జయంతిని పురస్కరించుకుని నాలెడ్జి సెంటరును ప్రారంభిస్తామన్నారు.

నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయం

ఉంగుటూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నైపుణ్యాలతో పోటీ పరీక్షలలో విజయం సాధించాలని విజయవాడ పీబీ సిద్ధార్థ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు శ్యాంబాబు అన్నారు. నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి ద్వారా పరీక్షలలో విజయం సాధించే విషయమై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ టికె విశ్వేశ్వరరావు, అధ్యాపకులు పి.బాబూరావు, రెడ్డియ్య, కె.రవి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సత్కారం

దెందులూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వేంపాడు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం కేఆర్ఎస్ఎస్‌కే వర్ధనీకి శనివారం ఉద్యోగ విరమణ సత్కారం జరిగింది. ఏపీ స్కూల్ టీచర్ల అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కె.వెంకటరమణ, టి.ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జంగిల్ క్లియరెన్స్

టి.నరసాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుంత రోడ్డు మరమ్మతుకు సర్పంచ్ తన సొంత నిధులతో పనులు చేపట్టారు. అల్లంచర్ల రాజుపాలెంకి చెందిన రైతులు అభ్యర్థనతో సర్పంచ్ ఎన్.వెంకటరావు సుమారు రూ.50 వేల సొంత సొమ్ముతో జంగిల్ క్లియరెన్స్ చేసి గుంతలను పూడ్చి పుంత మరమ్మతు చేశారు. దీంతో రైతులకు హర్షం వ్యక్తం చేశారు.

క్రైమ్ కార్నర్

ఎక్సైజ్ దాడులు

చింతలపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ పరిధిలో శనివారం రేచర్ల గ్రామంలో అధికారులు దాడులు చేయగా శివారు ప్రాంతంలో పది డ్రమ్ముల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేశారు. కొనుబోతు అంజలిపైన, రెండు లీటర్ల సారా కలిగిన ఇస్లావత్ వాసులపైన కేసులు నమోదు చేసినట్టు చింతలపూడి సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ భోగేశ్వరరావు, ఎస్ఐ రాజేంద్ర, చింతలపూడి ఎస్ఐ అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: తాడువాయిలో శనివారం ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి బెల్టు షాపు నిర్వహిస్తున్న ఒక వ్యక్తి వద్ద 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు.

కిరాయి బంధువులు



(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

మంచాన పట్టిన పెద్దలకు వీరే దిక్కు

మారుతున్న కాలంలో సరికొత్త పోకడ

నెలవారీ సొమ్ము చెల్లిస్తే సపర్యలు..

ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నంతో వృద్ధులు విలవిల

ఆఖరి క్షణాల్లో అయినవారు దూరం

బంధువులు, స్నేహితుల పాత్ర అంతంత మాత్రమే

చివరిలో అద్దె మనుషులే ఆధారం

ఒకప్పుడు ఎవరైనా ఇంట్లో మంచానపడితే ఏమైనా రోగాల బారిన పడితే వారి ఆలనా పాలనా చూసేందుకు కుటుంబంలో ఎవరో ఒకరు బాధ్యత భుజానకెత్తుకునే వారు. బంధు వులు, స్నేహితులు వచ్చీపోయే వారంతా ధైర్యం నూరి పోసేవారు. అస్వస్థత నుంచి పూర్తిగా బయట పడేంత వరకు ఇదంతా మా కర్తవ్యం అనేలా సేవలందించేవారు. కానీ రోజులు మారాయి. మనస్తత్వాలు మారాయి. రోజువారీ పని ఒత్తిడి ఇంకాస్త పెరిగింది. ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయి. ఎవరైనా మంచం పడితే చూసేవారే కరువయ్యారు. పల్లె, పట్నం తేడా లేకుండా అన్నింటా ఏదో తెలియని ఆవేదన..అద్దె మనుషులే ఇప్పుడు అన్నింటికీ ఆధారం.

ఎందుకిలా జరుగుతుంది


కుటుంబ వ్యవస్థలో ఏ రోజుకారోజు మార్పులు, చేర్పులు. ఒకప్పటి ప్రశాంత వాతావరణం చెదిరిపోయింది. ఉరుకులు, పరుగుల జీవనం. తెల్లవార్లూ నిద్రలేకుండా ఒత్తిడికి గురయ్యేవారు కొందరైతే కాలక్షేపంగా నెట్‌లో మునిగిపోయేవారు ఇంకొందరు. దురదృష్టవశాత్తు అనారోగ్యంతో ఎవరైనా మంచాన పడితే ఇక అప్పటి నుంచి కష్టాలు ఆరంభమే. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఇళ్ళల్లోనే నెలల తరబడి విశ్రాంతి తీసుకోవాలి. కాలు, చెయ్యి కదపలేని పరిస్థితిలో వారికి సేవలు అందించేందుకు ఎవరో ఒకరు నిత్యం తోడుకావాల్సిందే. ఇప్పుడు అలాంటి పరిస్థితుల్లో అత్యధికులు వృద్ధులే ఉంటారు. వయసుపైబడి తీవ్ర అనారోగ్యంతో దేవుడి పిలుపు కోసం ఎదురుచూస్తూ మంచాన పట్టిన వారికి కనీసం సేవలు అందించడం ఇప్పుడు ఆయా కుటుం బాల్లో ఒక పెద్ద టాస్క్. ఇంట్లో ఉన్న మహి ళలతో పాటు మిగిలిన వారికి రోజూ ఏదొక పని ఉండే ఉంటుంది. రోగి వద్దే అంటిపెట్టుకుని కూర్చోవడం, వారికి సపర్యలు చేయడం అత్యంత దుర్లభం. ఇలాంటి పరిస్థితులు ఒకనాడు ఏ కుటుంబంలో తలెత్తినా రక్తబంధు వుల్లో ఎవరో ఒకరు కలుగచేసుకుని వచ్చి వాలిపోయేవారు. రోజుల తరబడి వారికి దగ్గరుండి మరీ సేవలు అందించేవారు. ఎటు వంటి బేషజాలకు పోయేవారుకాదు. కాని ఇప్పుడు మాత్రం అలాంటి పరిస్థితులు కను మరుగయ్యాయి. వాటి స్థానంలో మంచాన పట్టిన మనిషికి ఇంట్లో ఏ హోదా ఉన్నా సరే పూర్తి సేవలు అందించేందుకు ఏ ఒక్కరూ రోజుకింత సమయం కేటాయించలేని విపత్కర పరిస్థితి. త్వరలోనే కోలుకుంటారు..ఏం పర్వా లేదని కనీసం ధైర్యవచనాలు పలికే వారు కూడా కరువయ్యారు. పిల్లలు ఒకచోట, పెద్దలు ఇంకొక చోట ఒంటరిగా ఉంటున్న కుటుంబాల్లోని వారికైతే అత్యంత దుర్భర పరిస్థితి. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా మూడో వ్యక్తికి చెప్పుకో లేనంత కష్టం. కనీసం ఓదార్పు మాట లకు అల్లంత దూరం. మంచం పట్టినా, ఆసు పత్రుల పాలైనా తోడుగా ఉండేవారి కోసం వెతు కులాట. నాలుగైదు రోజులొచ్చి సాయ పడం టంటూ బంధువుల దగ్గర నుంచి స్నేహి తుల వరకు వేడుకోలు. అయినా అందరూ బిజీ బిజీ. మాట వరుసకే తప్ప ఏ ఒక్కరూ నేరుగా వచ్చి చేయి అందించలేనివారే. ఆఖరుకి తోబు ట్టువులైనా, రక్త సంబంధీకులైనా, అత్యంత దగ్గర వారైనా అందరిదీ ఒకటే మాట..బిజీ..బిజీ.

అద్దెకు..మనుషులు

మారుతున్న కాలంతో పాటే కుటుంబ వ్యవ హారాలు మార్చుకోవాల్సిన పరిస్థితులు తలె త్తాయి. ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉన్న ప్పుడు తలోక చెయ్యి వేసి కష్టాల కడలిలో ఉన్న వారిని ఒడ్డుకు లాగేవారు. మంచాన పడితే స్వస్థత చేకూరేంత వరకు వదిలిపెట్టేవారే కాదు. ఆఖరుకి ఎంత కష్టమైనా సరే నెలల తరబడి తమకు అయిన వారి దగ్గరే సేవలు అందిస్తూ ఇంటి ముఖం చూడని బంధువులు ఎంత మందో ఉన్నారు. కాని రానురాను పరిస్థితులు తలకిందులవుతున్నాయి. ఇలాంటి ఆలోచనల స్థానంలోనే అద్దె మనుషులు పుట్టుకొచ్చారు. ఎక్కడైనా తల్లిదండ్రులు వృద్ధాప్యంతో మంచానపడితే వారి ఆలనపాలనా చూసే సమయం లేక బిడ్డలంతా బిజీబిజీగా మారారు. తమవారి కోసం అద్దె మనుషులను కొని తెచ్చుకుంటున్నారు. తల్లిదండ్రులకు సేవలు అందించేందుకు వీలుగా నెలకు రూ.30 నుంచి 40 వేలు చెల్లించి మరీ ఆడ, మగ మనుషులను నియమిస్తున్నారు. ఇలాంటివారు మంచం పట్టి లేవలేని వారికి సపర్యలు చేస్తూ 24 గంటలు వారితోనే ఉంటారు. అన్నీ ఉండి తమ బిడ్డలు దూరమై కేవలం మీలాంటి వారితో సేవ చేయించు కోవాల్సి వస్తుందంటూ మంచం పట్టినవారు కంట తడిపెడితే ఆ కన్నీటిని తుడిచే వ్యక్తులు ఈ అద్దె మనుషులే. చావొచ్చినా, పెళ్ళొచ్చినా కూడా ఇలాంటి వారే ఈనాటి సమాజంలో అందరికీ అవసరం అవుతున్నారు.

"తినడానికి ఉండడానికి లోటు లేదు. ఇప్పుడు వయస్సు పైబడి మంచాన పట్టాం. మా పని మేం చేసుకోలేకపోతున్నాం. పిల్లలు ఎక్కడో దూరంగా ఉంటున్నారు. రోజువారి కనీసం మాత్రలు వేసుకోవడానికి సాయపడేవారు లేకుండా పోయారు. పిల్లలకు ఈ విషయం చెబితే మేం రాలేంగాని ఓ మనిషిని మీకోసం పెడతున్నామంటున్నారు. అలాగే ఎవరో మొక్కు మొఖం తెలియని మనిషిని మా వద్దే ఉంచు తున్నారు. రోజంతా వారే దిక్కు. కష్టం వచ్చినా, సుఖం వచ్చినా ఒకనాడు మనసువిప్పి మాట్లాడుకునేవాళ్ళం. కాని ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. మనసులో బాధ ఎవరికి చెప్పుకోవాలి..ఏలూరుకు చెందిన సత్యనారాయణ అనే వయోవృద్ధుడి ఆవేదన ఇది. ఉన్నా లేకపోయినా మంచం పట్టిన వారిని ఆలనా పాలనా చూసుకునేందుకు ఏలూరు నగరంతో పాటు అనేక ప్రాంతాల్లో ఇప్పుడు కొంతమంది 'సేవ'లకు వీలు కల్పిస్తున్నారు. అసలు కదలలేని స్థితిలో ఉన్నవారికైతే వారి వ్యవహారాలన్నింటిని చక్క బెట్టేందుకు నెలకు 25 వేల నుంచి 35 వేల రూపాయలు చెల్లించగలిగితే ఆడ లేదా మగ మనిషిని అందుబాటులో తెచ్చేందుకు ఇప్పు డిప్పుడే కొందరు ముందుకొస్తున్నారు.

కాయ కల్ప అవార్డుకు నూజివీడు ఆసుపత్రి



నూజివీడు ఏరియా ఆసుపత్రి



2019లో సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సూపరింటెండెంట్ నరేంద్రసింగ్

నూజివీడు ఆసుపత్రికి ఐదోసారి అవార్డు

నూజివీడు టౌన్ : జాతీయస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందించిన ఆసుపత్రులకు ప్రదానం చేసే కాయకల్ప అవార్డుల్లో నూజివీడు ఏరియా ఆసుపత్రి చోటుదక్కించుకుంది. దేశంలోని పలు ఏరియా ఆసుపత్రులు, పీహెచ్‌సీలతో పోటీపడి రాష్ట్రస్థాయిలో రెండో స్థానంలో నిలిచి అవార్డును అందుకుంది. ఆసుపత్రుల్లో పారిశుధ్య నిర్వహణ, అందిస్తున్న సేవలకు ఈ అరుదైన గౌరవం ఏరియా ఆసుపత్రికి మరోసారి దక్కింది. రాష్ట్రంలోని ఏరియా ఆసుపత్రుల్లో నూజివీడు ఆసుపత్రి 2015 నుంచి ఇప్పటి వరకు వరుసగా నాలుగుసార్లు కాయకల్ప అవార్డును అందుకోగా, ప్రస్తుత ఏడాది మరోసారి ఎంపికైంది. 2019లో ఎన్‌క్యూఏఎస్ సర్టిఫికెట్‌ను పొందింది. ఇదేకాక 2019లో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఉత్తమ ఏరియా ఆసుపత్రిగా అవార్డును అందుకుంది. వీటితో పాటు 2011 నుంచి ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అందుకునే అవార్డులను నూజివీడు ఏరియాఆసుపత్రి వరుసగా అందుకోవడం విశేషం.

అవార్డు రావడం ఆనందాన్నిచ్చింది..



నూజివీడు ఏరియా ఆసుపత్రికి కాయకల్ప అవార్డు రావడం ఆనందంగా ఉంది. దీనికి సంబంధించిన అధికారిక సమాచారం అధికారుల నుంచి ఇంకా రావాల్సి ఉంది. ఇప్పటికి నాలుగుసార్లు కాయకల్ప అవార్డు అందు కోగా మరోసారి అవార్డుకు ఎంపిక కావడం విశేషం.

- నరేంద్రసింగ్, సూపరింటెండెంట్, నూజివీడు ఏరియా ఆసుపత్రి

బైక్ డిక్కీలో పెట్టిన రూ.2.5 లక్షలు కొట్టేశారు

ఏలూరు క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకులో నగదు డ్రా చేసుకుని ఆ సొమ్మును ద్విచక్ర వాహనంలో ఉంచి పనిచూసుకుని వచ్చే లోపల ఆ సొమ్మును అపహరించుకు పోయిన వ్యక్తిని భీమడోలు పోలీసులు అరెస్టు చేసి మొత్తం సొమ్మును స్వాధీనం చేశారని ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ చెప్పారు. శనివారం రాత్రి ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీ తోపాటు భీమడోలు సీఐ యూజే విల్సన్, భీమడోలు ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్ పాల్గొన్నారు. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లికి చెందిన నందమూరి సత్యనారాయణ వ్యవసాయం చేసి జీవిస్తున్నారు. ఆయన భీమడోలులోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచికి ఈనెల 25 మధ్యాహ్నం 12 గంటలకు వచ్చి రూ.2.5 లక్షలు విత్‌డ్రా చేసుకున్నారు. ఆ సొమ్మును స్కూటర్ డిక్కీలో పెట్టుకుని, దగ్గరలోని నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు షాపులోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి డిక్కీలో సొమ్ము అపహరణకు గురైంది. ఈ ఘటనపై వెంటనే భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సీఐ యూజే విల్సన్, ఎస్ఐ సుధాకర్, ద్వారకాతిరుమల ఎస్ఐ సుధీర్, సిబ్బంది ప్రత్యేక బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారు. మొత్తం మీద ఈ నేరానికి పాల్పడిన భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన సప్పా రాముని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రెండున్నర లక్షల రూపాయల నగదును స్వాధీనం చేశారు. నిందితుడికి అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ, ఎస్ఐలను వారి సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



ముదినేపల్లిలో సంచుల్లోకి ధాన్యాన్ని ఎత్తుతున్న రైతులు



కోరుకొల్లులో ధాన్యపు రాశులపై కప్పిన పరదాలు



తామరకొల్లులో రైతులతో మాట్లాడుతున్న అధికారులు

అన్నదాత బెంబేలు

ముదినేపల్లి/ కలిదిండి/కైకలూరు,నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాన్ ప్రభావంతో శనివారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షాలతో ఆరబెట్టి అమ్మకానికి సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. ఎక్కడి ధాన్యం అక్కడే నిల్వ ఉండిపోయింది. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 15 వందల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు పరదాల నీడన ఉంది. వారం రోజులుగా ఆరబెట్టిన ధాన్యంలో వర్షం వల్ల తిరిగి తేమ శాతం పెరిగే ప్రమాదం ఉందని, ఇదే అదనుగా మిల్లర్లు ధరల్లో కోత విధించే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 6 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా, మరో 7 వేల ఎకరాల్లో కోతలు చేపట్టాల్సి ఉంది. కలిదిండి మండలం కోరుకొల్లు, సానారుద్రవరం, గోపాలపురం, వెంకటాపురం గ్రామాల్లో కల్లాల్లో ధాన్యపు రాశులను పరదాలతో కప్పి కాపాడుకుంటున్నారు. కొంతమంది రైతులు కల్లాల్లో ధాన్యాన్ని ట్రాక్టర్లపై మిల్లుకు తరలిస్తున్నారు. కైకలూరు మండలంలో తామరకొల్లు, వింజరం గ్రామాల్లో ధాన్యం రాశులు తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్నారు. మండలంలో తామరకొల్లు, వింజరం, ఆచవరం, వేమవరప్పాడు గ్రామాల్లో వరి కోతలు 80 శాతం పైగా పూర్తయ్యాయి. రాచపట్నం, గోపవరం గ్రామాల్లో ఇంకా కోతలు కోయాల్సి ఉంది. వింజరంలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఇబ్రహీం, వ్యవసాయ శాఖ ఏవో దివ్య ధాన్యం రాశులను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. మరోవైపు ఆక్వా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉష్ణోగ్రతలు పూర్తిగా పడిపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రొయ్యల చెరువుల్లో రైతులు ఏరియేటర్లను నిరంతరం తిప్పుతున్నారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ నాశనం

ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్

కైకలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, వాటి వినియోగం చట్టరీత్యా నేరమని ఎక్సైజ్ సీఐ షేక్ రమేష్ అన్నారు. కైకలూరు విజ్ఞాన్ విద్యాసంస్థల్లో శనివారం విద్యార్థులకు మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, విద్యార్థులు పూర్తిగా దృష్టిని విద్య పైనే ఉండాలన్నారు. ఎస్ఐలు ఆదినారాయణ, ఆలీం, కళాశాల కరస్పాండెంట్ జీపీ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.



కలిదిండిలో పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో కొండలరావు



అల్లూరులో పింఛను పంపిణీ చేస్తున్న తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు నాగరాజు

పింఛన్ల పంపిణీ

కలిదిండి/ముదినేపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం సాయంత్రానికి 90 శాతం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారని ఎంపీడీవో కొండలరావు తెలిపారు. శనివారం కలిదిండి పంచాయతీ కార్యాలయంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. పంచాయతీ ఈవో ఉదయ్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ముదినేపల్లి మండలంలో శనివారం 92 శాతం పూర్తయింది. మండలంలో 8,888 మంది పెన్షనర్లకు రూ.3.72 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా, 8,177 మందికి రూ.3.43 కోట్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో వై.రామకృష్ణ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎన్డీఏ నాయకులు పెన్షన్లను లబ్ధిదారులకు అందజేశారు.

మనోజ్‌కు విశ్వగురు వరల్డ్ రికార్డ్సు బెస్ట్ ఫాదర్ అవార్డు



ముదినేపల్లి, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): హైదరాబాద్ విశ్వగురు వరల్డ్ రికార్డ్సు సంస్థ కామధేను అవార్డు కింద ఏటా ఇచ్చే బెస్ట్ ఫాదర్ అవార్డుకు ఈ ఏడాది ముదినేపల్లికి చెందిన ప్రైవేట్ వైద్యుడు, అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ ఎంపికయ్యారు. ఈ అవార్డును డిసెంబరు 8న హైదరాబాద్‌లో జరగనున్న కార్యక్రమంలో ఆయనకు అందజేసి సత్కరించనున్నట్టు సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు తెలిపారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

మండవల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. డిసెంబరు 1న ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కైకలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వేంపాటి సాయి సత్యనారాయణ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన పెంపొందించు కోవాలన్నారు. కైకలూరు ప్యానెల్ న్యాయవాది పవన్‌కాంత్, న్యాయవాది వెంకటప్పయ్య, డాక్టర్ సుమ, సీహెచ్ శ్రీనివాసరావు, ఆస్పత్రి స్థలం దాత సీహెచ్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.




సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ అన్నారు. నూజివీడులో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల వద్ద దొంగతనాలకు పాల్పడే నేరగాళ్ళతో జాగ్రత్తగా ఉండాలని, పోలీసులు ఎవరూ మీపై కేసు ఉందని వీడి యో కాల్ ద్వారా చెప్పరని, అలా వచ్చే ఫోన్‌లపై తక్షణం సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. వృద్ధులకు సంబంధించి బ్యాంకుల్లో లావాదేవీలు నిర్వహించేందుకు సాయం అవసరమైతే బ్యాంకు అధికారుల సాయాన్ని తీసుకోవాలని సూచిస్తూ నూజివీడు పట్టణం లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు.

కల్లాలపై ఉన్న ధాన్యాన్ని రైతులు భద్రపరచాలి



చెక్కపల్లిలో కల్లాపై ఉన్న ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో

ముసునూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ ప్రభావంతో చిరుజల్లులు కురుస్తున్నందున కల్లాలపై వున్న ధాన్యాన్ని రైతులు భద్రపరచుకోవాలని ఏవో ఎస్.మధుమోహన్ సూచించారు. శనివారం చెక్కపల్లి, సూరేపల్లి, లోపూడి, చింతలవల్లి, గోపవరం తదితర గ్రామాల్లో కల్లాలపై ఉన్న ధాన్యపురాశులను ఆయన పరిశీలించి, రైతులకు సూచనలు చేశారు. తుఫాన్ వల్ల వర్షాలు కురిసే ఆవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో కల్లాలపై ఉన్న ధాన్నాన్ని పరదాలతో తడవకుండా భద్రపరచుకోవాలన్నారు. ఎప్పటికప్పు డు పరదాలపై ఉన్న వర్షపునీటిని రైతులు తొలగించుకోవాలన్నారు. వీహెచ్‌ఏ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వాల నమోదు

కలిదిండి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఎల్.రత్నారావు ఆధ్వర్యంలో శనివారం కలిదిండిలో టీడీపీ సభ్యత్వాల నమోదు చేశారు. బూత్ కమిటీ సభ్యులు చిట్టూరి భాస్కరరావు, సానా సతీష్ పాల్గొన్నారు.

యాదవులు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలి

మంత్రి కొలుసు పార్థసారథి



మంత్రి పార్థసారథిని సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

కైకలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సామాజికంగా, ఆర్థికంగా ఎదుగుతూ యాదవులు ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవాలని సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. కైకలూరు సీఎన్నార్ గార్డెన్‌లో నియోజకవర్గ శ్రీకృష్ణాయాదవ సంక్షేమ సంఘం 21వ కార్తీక వనసమారాధనను శనివారం సంఘ అధ్యక్షుడు కరేటి శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ యాదవ కల్యాణ మండపాల నిర్మాణాలకై కృషి చేస్తామన్నారు. విద్యారంగంలో రాణిస్తున్న విద్యార్థులకు నగదు బహుమతులు పంపిణీ చేశారు. టీటీడీ బోర్డు మెంబర్ జంగా కృష్ణమూర్తి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు వైసీపీ పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్, రాష్ట్ర అఖిలభారత యాదవ సంఘం అధ్యక్షుడు లాకా వెంగళరావు, ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మిడి చింతయ్య, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా : మంత్రి

ముసునూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తనను గెలిపించి మంత్రిని చేసిన నూజివీడు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా కృషిచేస్తానని మంత్రి పార్థసారథి అన్నారు. శనివారం వేల్పుచర్ల గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను పలకరించి పింఛన్లను ఆయన అందించారు. ఈ సదర్భంగా మంత్రి దంపతులు తమ సొంత నగదుతో 350 మంది పెన్షన్‌దారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వా, తాతలకు అండగా ఉంటానన్నారు. పలువురు గ్రామస్థుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జి.సుబ్బారావు, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, డీఎల్‌పీవో సుందరి, ఎంపీడీవో జి.రాణి, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఎం.గంటేశ్వరావు, నాయకులు అబ్బినేని రాంబాబు, టి.నాగేశ్వరరావు, గరికిముక్కు నాని, వంశీ, కాపా శ్రీనివాసరావు, అక్కినేని చందు పాల్గొన్నారు.



సబ్ జైల్లో స్టోర్ రూమ్‌ను పరిశీలిస్తున్న జడ్జి నాగ శైలజ

నిందితులకు మెరుగైన వసతులు కల్పించాలి

నూజివీడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూజివీడు సబ్‌జైల్లో నిందితులకు మెరుగైన వసతి సదుపాయాలను ఏర్పాటు చేయాలని 15.వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ సూచించారు. శనివారం నూజివీడు సబ్‌జైలు ప్రాంగణాన్ని ఆమె రెండో అదనపు మెజిస్ట్రేట్ శివపార్వతితో కలిసి సందర్శించారు. నిందితులందరికీ న్యాయవాదులు ఉన్నారా వారికి ఆరోగ్య స్థితిగతులు ఎలా ఉన్నాయి అనేది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

8న మాదిగల ఆత్మీయ కలయిక సభ

ఆగిరిపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో ఈనెల 8న మాదిగల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మాదిగల ఆత్మీయ కలయిక భారీ బహిరంగ సభ జరుగు తుందని ఆగిరిపల్లి సర్పంచ్ లక్ష్మీవిక్టర్‌బాబు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు తెలిపారు. శనివారం ఆగిరిపల్లిలో సంబంధిత ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సభకు ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా మంద కృష్ణ మాదిగ సభకు విచ్చేస్తున్నట్టు తెలిపారు. నాయకులు నల్లమోతు కాంచనరావు, బట్టుమర్తి రాము, బొబ్బర్ల సురేష్, కంబాల ప్రదీప్, ముల్లంగి శ్రావణ్ ఉన్నారు.



సీ-గుడిపాడులో ప్రజా హక్కుల ర్యాలీకి తరలిరావాలని ప్రచారం

4న ప్రజా హక్కుల ర్యాలీ విజయవంతం చేయాలి

చాట్రాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో డిసెంబరు 4న జరిగే ప్రజా హక్కుల ర్యాలీకి ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం మండలంలోని సీ-గుడిపాడులో ప్రచారం నిర్వహించారు. లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్, జిల్లా నాయకుడు పుల్లారావు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థకు తూట్లు పొడుస్తూ నిరంకుశ పాలన సాగిస్తుందని విమర్శించారు. సూపర్‌సిక్స్ హామీలతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు అమలు చేయకపోవడం శోచనీయమన్నారు.

చాట్రాయి మండలంలో 90.79 శాతం పింఛన్ల పంపిణీ



సూరంపాలెంలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు నక్కా రాము

చాట్రాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలో పెన్షన్లు శనివారం 90.79 శాతం పంపిణీ చేశామని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. చనుబండలో తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, పరసా శ్రీనివాసరావు, బీజేపీ నాయకుడు నెక్కలపు వెంకటేశ్వరరావు, సూరంపాలెంలో టీడీపీ నాయకుడు నక్కా రాము, జనార్దనవరంలో తెలుగు మహిళా నాయకురాలు మాదాసు చంద్రకళ, ఎస్సీ సెల్ నాయకుడు బలుసూరి ర్తయ్య, చాట్రాయిలో టీడీపీ బీసీ సెల్ నాయకుడు కంపసాటి చెన్నారావు పెన్షన్లు పంపిణీ చేశారు. మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో మొత్తం 8,336 పింఛనుదారులు ఉండగా శనివారం 7,568 మందికి పంపిణీ చేశామని అధికారులు తెలిపారు.

తిరువూరు నుంచి వాడపల్లికి ప్రతి శనివారం బస్సు

చాట్రాయి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నుంచి ప్రతి శనివారం వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ బస్సు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ ప్రతి బస్సు శనివారం ఉదయం 4.30 గంటలకు తిరువూరులో బయలుదేరి విస్సన్నపేట, చాట్రాయి, చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు మీదుగా వాడపల్లికి 10.30 గంటలకు చేరుతుందన్నారు. దైవదర్శనం అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు బస్సు వాడపల్లిలో బయలుదేరి ఇదే రూట్‌లో రాత్రి 8 గంటలకు తిరువూరు చేరుతుందని వివరించారు. అప్‌అండ్‌డౌన్ టిక్కెట్ ధర తిరువూరు నుంచి రూ. 605, విస్సన్నపేట నుంచి రూ.530, చింతలపూడి నుంచి రూ.430 అని, టిక్కెట్లు ఆన్‌లైన్‌లోను, ఏపీఎస్ఆర్టీసీ కౌంటర్‌లోను పొందవచ్చన్నారు.

7న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

మండవల్లి నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పుట్లచెరువు జడ్పీ హైస్కూల్‌లో డిసెంబరు 7న నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం ఆవిష్కరణ శనివారం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంపీటీఎం అక్షరాలు వచ్చేలా ప్రదర్శన ఇచ్చారు. తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దలు, దాతలను ఆహ్వానిస్తున్నామని విద్యార్థులు తెలిపారు.